## బడిలో నిరసనలు

**బోధనేతర పనులను బహిష్కరించిన టీచర్లు**



కళ్యాణదుర్గం మండలంలో బోధనేతర పనులను బహిష్కరించి నిరసన తెలుపుతున్న టీచర్లు

అనంతపురం విద్య, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): బడిలో టీచర్లు నిరసన బాటపట్టారు. డిమాండ్ల సాధనలో భాగంగా ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల ఉద్యమం మొదలైంది. తొలిరోజు శుక్రవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బోధనేతర పనులను బహిష్కరించారు. కేవలం టీచర్లు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన వివరాలు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేసి, పిల్లలకు పాఠాలు బోధించారు. భోజన విరామ సమయంలో అనేక పాఠశాలల్లో బోధనేతర పనులను విరమించుకోవాలని, డీఏలు, పీఆర్‌సీ కమిషన్, ఐఆర్ ప్రకటించాలనీ, బకాయి ఉన్న బిల్లులను క్లియర్ చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనలు తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలనీ, లేదంటే ఉద్యమం మరింత ఉధృతం చేయాల్సి వస్తుందని ఉపాధ్యాయ సంఘాల నేతలు హెచ్చరించారు.

## ఇక బడిబాట..!

- ముగిసిన కొత్త టీచర్ల నియామక ప్రక్రియ 6
- నేడు ఉత్తర్వులు.. సోమవారం నుంచి విధులకు..





జాతీయ రహదారి వెంబడి లేపాక్షి హబ్‌కు కేటాయించిన వేలాది ఎకరాల భూములు ఇవే

# పారిశ్రామిక పండగొచ్చింది..!

- ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం
- భూముల కేటాయింపు
- కరువు నేలకు పెట్టుబడుల వరద
- ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమకూ గ్రీన్ సిగ్నల్

**శ్రీసత్యసాయి జిల్లాకు రేమండ్.. అనంతకు సోలార్ ప్లాంట్లు**





గుడిపల్లి పారిశ్రామిక పార్కు

పుట్టపర్తి/హిందూపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు దసరా, దీపావళితోపాటు పారిశ్రామిక పండగొచ్చింది. పెట్టుబడుల వరద వస్తోంది. శ్రీసత్యసాయి జిల్లాలో రేమండ్ రెండు అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేయనుంది. అనంతపురం జిల్లాలో రెండు చోట్ల సోలార్ ప్రాజెక్టులు ఏర్పాటుకానున్నాయి. అంతేకాదు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ కూడా అందుబాటులోకి రానుంది. శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

టేకులోడు, గుడిపల్లిలో ఏరోస్పేస్ ఆటోమోటిక్ కాంపోనెంట్ పరిశ్రమలు రేమండ్ గ్రూప్ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చింది. అందుకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రేమండ్ గ్రూప్ అనుబంధ సంస్థ జేకే మైని ప్రెసిషన్ టెక్నాలజీ లిమిటెడ్‌కు ఆటోమోటివ్ కాంపోనెంట్ తయారీ కోసం సోమందేపల్లి మండలం గుడిపల్లి పారిశ్రామిక పార్కులో 30 ఎకరాలను కేటాయించారు. ఎకరా రూ.45.95 లక్షలతో అప్పగించారు. రూ.430 కోట్ల పెట్టుబడితో ఏర్పాటుకానున్న ఈ పరిశ్రమ ద్వారా 4,096 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. రేమండ్ గ్రూప్‌నకే చెందిన మరో అనుబంధ సంస్థ జేకే మైని గ్లోబుల్ ఏరోస్పేస్ లిమిటెడ్ చిలమత్తూరు మండలం టేకులోడుతోపాటు గుడిపల్లి పారిశ్రామి పార్కులో ఏరోస్పేస్ విడిభాగాల తయారీ పరిశ్రమ ఏర్పాటు చేయనుంది. రూ.510 కోట్లు పెట్టుబడితోట 1,400 మందికి (మిగతా 6లో..)

## దంచికొట్టిన వాన

- నీట మునిగిన పంట పొలాలు
- వరి, మొక్కజొన్న, వేరుశనగకు నష్టం



బొమ్మనహాళ్ మండలం సిద్దరాంపురంలో నీటిమునిగిన మొక్కజొన్న పంట

బొమ్మనహాళ్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు కుండపోత వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. సిద్ధరాంపురం, చంద్రగిరి, కురువళ్లి గ్రామాల పరిధిలో వరి, మొక్కజొన్న, మిరప, జొన్న, వేరుశనగ తదితర పంటలు నీటమునిగాయి. భారీగా నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిద్ధరాంపురంలో కోత కోసి కుప్పలుగా వేసిన మొక్కజొన్న పంట తడిసిపోయింది. చంద్రగిరిలో గ్రామదేవత ఆలయంలోకి వర్షపు నీరు చేరింది. రోడ్డుపై భారీగా నీరు పారింది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. బండూరు వంక పారడంతో గోవిందవాడ, దర్గాహొన్నూరు తదితర గ్రామాల ప్రజలు ఇబ్బంది పడ్డారు. వర్షం కారణంగా పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తహసీల్దార్ మునివేలు, ఏఓ సాయికుమార్ గ్రామాల్లో పర్యటించి, పంట నష్టాన్ని అంచనా వేశారు. మొక్కజొన్న 90 ఎకరాలు, వేరుశనగ 300 ఎకరాలు, వరి 110 ఎకరాలలో దెబ్బతిందని ఉన్నతాధికారులకు ప్రాథమిక నివేదిక పంపించారు.



చంద్రగిరిలో దేవాలయం వద్ద నిలిచిన నీరు

### 17 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్: జిల్లాలోని 17 మండలాల్లో గురువారం వర్షం కురిసింది. అత్యధికంగా బొమ్మనహాళ్‌లో 8.4 సెం.మీ., రాప్తాడు 4.1, బెలుగుప్ప 2.4, కళ్యాణదుర్గం 2.1, పామిడి 2, బ్రహ్మసముద్రం 1.2 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మిగతా ప్రాంతాల్లో 0.8 సెం.మీ. లోపు వర్షపాతం నమోదైంది.

### పప్పుశనగకు ఊపిరి

బెళుగుప్ప: మండలంలో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన మోస్తరు వర్షం పప్పుశనగ పంటకు ఊపిరిపోసింది. అదునుదాటుతుందని అరకొర తేమలోనే ఎర్రగుడి, తగ్గుపర్తి, వెంకటాద్రిపల్లి, బెళుగుప్ప తదితర గ్రామాల విత్తనం వేశారు. రైతులు ఎదురుచూస్తున్న తరుణంలో పదును వాన కురిసింది.



చంద్రగిరిలో నీటమునిగిన వరి పంట

## విధుల సమయంలో సమావేశాలా?

**రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్‌తో జేసీ**

**అలిగిన సంఘం ప్రతినిధులు**

**కలెక్టర్ జోక్యంతో సద్దుమణిగిన వివాదం**

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జాయింట్ కలెక్టర్, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ మధ్య స్వల్ప వివాదం తలెత్తింది. విధి నిర్వహణ సమయంలో ఉద్యోగులను మీటింగ్ పేరుతో పిలుచుకెళ్లడంపై జేసీ శివనారాయణ శర్మ ఒకింత అసహనం వ్యక్తంచేశారు. ఈ విషయంలో తమకు మద్దతు ఇవ్వలేదంటూ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు అలక వహించారు. చివరకు కలెక్టర్ జోక్యం చేసుకుని, వివాదం సద్దుమణిచారు. రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతపురంలో నవంబరు 7, 8, 9 తేదీల్లో రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడా ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే పలు పోటీలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా కడప నగరంలో అనంతపురం, కర్నూలు రెవెన్యూ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ నిర్వహిస్తున్నారు. మ్యాచ్ ప్రారంభోత్సవానికి జేసీని ఆహ్వానించడానికి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు దివాకర్‌రావు, రాష్ట్ర నేతలు కలిసి జేసీ బంగ్లాకు వెళ్లారు. ఈ సమయంలో రెండు రోజుల క్రితం ఆర్డీటీలో ఉద్యోగుల సమావేశం నిర్వహించిన విషయం జేసీ లేవనెత్తారు. ఉద్యోగులు పనిచేసే సమయంలో వారిని అలా సమావేశాల పేరుతో తీసుకెళ్తే ఎలా అని ప్రశ్నించారు. అలా తీసుకెళ్లే సమయంలో అనుమతి తీసుకోవాలన్నారు. ఇందుకు బొప్పరాజు, ఇతరులు స్పందిస్తూ... క్రీడల నిర్వహణకు ప్రత్యేకంగా జీఓ తీసుకొచ్చామనీ, కలెక్టర్‌తో కలిసి సహకారం అందించాలని కోరామని చెప్పామన్నారు. ఈ విషయంలో జేసీ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు తమకు జేసీ మద్దతు ఇవ్వలేదని అలక వహించారు. వారు నేరుగా కలెక్టరేట్‌కు వచ్చారు. విషయం తెలుసుకున్న కొందరు సీనియర్ అధికారులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అదే సమయంలో రాయదుర్గం పర్యటనలో ఉన్న కలెక్టర్ ఆనంద్ దృష్టికి విషయం తీసుకెళ్లారు. దీంతో ఆయన రాయదుర్గం నుంచి వచ్చాక రాత్రి సమయంలో అసోసియేషన్ నాయకులు సమావేశమయ్యారు. వివాదానికి కారణమైన అంశంపై కలెక్టర్ ఆరాతీశారు. వారితో చర్చించి, వివాదాన్ని సద్దుమణిచారు.

## ఐసీడీఎస్ పీడీ బాధ్యతల స్వీకరణ

అనంతపురం వైద్యం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ పీడీగా అరుణకుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె శిశుగృహను సందర్శించారు. అక్కడి సదుపాయాలు పరిశీలించారు. ఎంతమంది శిశువులు సంరక్షణ పొందుతున్నారని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీడీపీఓలతోపాటు నోడల్ ఆఫీసర్ వనజాక్షి, సీనియర్ అసిసెంట్లు ధనలక్ష్మీ, బాబా నూరుద్దీన్, ఎక్స్‌టెన్సన్ ఆఫీసర్ రఫీమున్సీసా, మసూద్ బాషా పాల్గొన్నారు.



ఐసీడీఎస్ పీడీగా బాధ్యతలు స్వీకరిస్తున్న అరుణకుమారి

## జీఎస్టీ 2.0తో వస్త్ర పరిశ్రమకు ప్రోత్సాహం

- ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



జీఎస్టీ తగ్గింపు వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్, ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గంరూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0తో వస్త్ర పరిశ్రమకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో వాణిజ్య పన్నుల శాఖ కళ్యాణదుర్గం అసిస్టెంట్ కమిషనర్ సుజిత ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో విప్‌తో పాటు కలెక్టర్ ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ వస్తువులు, గృహోపకరణాలను ప్రదర్శించారు. అనంతరం కాలవ మాట్లాడుతూ రెడీమేడ్ గార్మెంట్స్‌పై జీఎస్టీని ఐదు శాతానికి తగ్గించడం గొప్ప వరం అన్నారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడు తూ జీఎస్టీ 2.0 సంస్కరణలతో పేద, మధ్య తరగతి వారికి ప్రతి నెలా రూ.15 వేలు ఆదా అవుతుందన్నారు. చిన్న, కుటీర పరిశ్రమలకు పెట్టుబడి భారం తగ్గుతోందన్నారు. అనంతరం సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీసీటీఓ సురేష్‌కుమార్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీఈఓ కొండన్న, మున్సిపల్ కమీషనర్ దివాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మంజూరైన యూనిట్లను గ్రౌండింగ్ చేయించండి

మండలంలోని 74 ఉడేగోళం గ్రామ సమీపంలో టెక్స్‌టైల్ పార్కులో మంజూరైన యూనిట్లను గ్రౌండింగ్ చేయించాలని కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాయదుర్గం పట్టణ శివారులోని టెక్స్‌టైల్ పార్కును కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ టెక్స్‌టైల్ పార్క్‌లో ఇంతకు ముందు మంజూరైన యూనిట్లను త్వరగా గ్రౌండింగ్ చేసేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు.

## ఇంక భరించలేను కొడుకా..!

**మద్యానికి బానిసై.. తల్లిని వేధించిన కొడుకు**

**మరో ఇద్దరితో కలిసి గొంతు నులిమేసిన తల్లి**

**హైదరాబాదులో అనంత యువకుడి హత్య**

పంజాగుట్ట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కొడుకుతో కలిసి పొట్టచేతబట్టుకుని హైదరాబాదుకు వెళ్లిన ఓ మహిళ.. అనూహ్యంగా పేగు బంధాన్ని తెంచుకుంది. మద్యానికి బానిసై, నిత్యం వేధిస్తుండటంతో భరించలేక చంపేసింది. పంజాగుట్ట పోలీసులు తెలిపిన మేరకు, అనంతపురం జిల్లాకు చెందిన గంగులమ్మ సుమారు 20 సంవత్సరాల క్రితం తన కుమారుడు హర్షవర్ధన్‌తో కలిసి హైదరాబాదుకు చేరుకుంది. బేగంపేట ఉమానగర్‌లోని ఓ ఇంట్లో వాచ్‌మెన్ గదిలో ఉంటూ, చుట్టు పక్కల ఇళ్లలో పనులు చేస్తూ జీవిస్తోంది. ఆమె కుమారుడు ఏ పనీ చేయకుండా జులాయిగా తిరిగేవాడు. మద్యానికి బానిసై.. డబ్బుల కోసం తల్లిని వేధించేవాడు. డబ్బులు ఇవ్వకపోతే ఆమెను కొట్టేవాడు, అసభ్య పదజాలంతో దూషించేవాడు. ఆమె సంపాదించిన సొమ్మును లాక్కుపోయి మద్యం తాగి వచ్చేవాడు. మత్తులో ఆమెపై దాడి చేసేవాడు. వేధింపులు నానాటికీ పెరగడంతో కొడుకును కడతేర్చాలని నిర్ణయించుకుంది. ఈ విషయాన్ని వేరే ఇంట్లో వాచ్‌మన్‌గా పని చేస్తున్న ఓ వ్యక్తి చెప్పింది. హత్యకు అతను అంగీకరించడంతో గురువారం అర్ధరాత్రి తన ఇంటికి పిలిపించింది. అతను మరో వ్యక్తిని తోడుగా తీసుకువచ్చాడు. అప్పటికే మద్యం మత్తులో హర్షవర్ధన్ నిద్రపోతుండగా, అందరూ కలిసి గొంతు నులిమి చంపేశారు. ఆ తరువాత ఆ ఇద్దరు వ్యక్తులు వెళ్లిపోయారు. తన కుమారుడు ఎంత లేపినా లేవడం లేదని శుక్రవారం ఉదయం స్థానికులను పిలిచి చెప్పింది. ఏమీ ఎరగనట్లు కుమారుడి మృతదేహం వద్ద ఏడుస్తూ కూర్చుంది. స్థానికులతో కలిసి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేసింది. మృతదేహాన్ని పాడే పైకి మార్చే సమయంలో వారు గాయాలను గుర్తించారు. అనుమానం వచ్చి పంజాగుట్ట పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ అక్కడికి చేరుకుని విచారించారు. దీంతో హత్య చేసిన విషయాన్ని కన్నతల్లి అంగీకరించింది. దీంతో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. ఆమెకు సహకరించిన ఇద్దరిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




**వీఆర్వోలు ఏరీ ?** ఐదు రెవెన్యూ గ్రామాలకు ఇన్‌చార్జ్‌లే దిక్కు 6 **లైవ్ బకాయిలు !** ● బీఎస్ఎన్ఎల్‌కు రూ.40 లక్షల బిల్లుల పెండింగ్


## పసివాడిని బలిగొన్న తేనీరు



యాడికిలో విషాద ఘటన (వివరాలు మెయిన్‌లో)



రుత్విక్ (ఫైల్), మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

## కేజీబీవీ విద్యార్థిని గుండెపోటుతో మృతి



- సిబ్బంది నిర్లక్ష్యం.. సకాలంలో అందని వైద్యం
- ఆందోళనకు దిగిన తల్లిదండ్రులు, గ్రామస్థులు



చందన(ఫైల్), చందన మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు (వివరాలు మెయిన్‌లో)


**ఉమ్మడి జిల్లాకు పీఎండీడీకేవై** వ్యవసాయానికి ఊరట 7
- రైతాంగానికి భరోసా
- సీఎం చంద్రబాబు దార్శనికత
- మంత్రి కేశవ్ చొరవతోనే..


## రేపు పరిష్కార వేదిక

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లో ఈనెల 13వతేదీ ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆనంద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# వీఆర్వోలు ఏరీ ?

## ఐదు రెవెన్యూ గ్రామాలకు ఇన్‌చార్జ్‌లే దిక్కు

● పనులు సాగక ప్రజలు, రైతులకు ఇబ్బందులు




రాప్తాడు తహసీల్దార్ కార్యాలయం

రాప్తాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోల కొరతతో మండల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఐదు మేజర్ రెవెన్యూ గ్రామాలకు ఇన్‌చార్జ్ వీఆర్వోలే దిక్కువడంతో తమ సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మేజర్ రెవెన్యూ గ్రామాలైన గాండ్లపర్తి, బండమీదపల్లి, యర్రగుంట, రాప్తాడు, గంగలకుంటకు గత ఆరు నెలలుగా రెగ్యులర్ వీఆర్వోలు లేరు. ఇన్‌చార్జ్ వీఆర్వోలే వీటి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ రెవెన్యూ గ్రామాల్లో అనేక భూ సమస్యలు ఉన్నాయి. వీఆర్వోల కొరత వలన కొన్ని రకాల పనులు ముందుకు కదలడం లేదు.

### ఆలస్యమవుతున్న పనులు

రెగ్యులర్, ఇన్‌చార్జ్ రెవెన్యూ గ్రామాల విధులతో పని ఒత్తిడి పెరిగిందని, ఎక్కడా పూర్తి స్థాయిలో న్యాయం చేయలేకపోతున్నట్లు వీఆర్వోలు వాపోతున్నారు. రెవెన్యూ శాఖలో వీఆర్వోల పాత్ర కీలకం. వారి సంతకం లేనిదే ఏ ఫైలు కదలదు. వీఆర్వోలు కొరత వలన కులం, ఆదాయం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, భూ సమస్యలు, ఓటర్ వెరిఫికేషన్, ఈ క్రాప్, ఆధార్ వెరిఫికేషన్, రేషన్ కార్డులు, రికార్డులు రాయడం, సర్వే, భూ సమస్యలు, ఇతర అనేక పనులు సకాలంలో పూర్తికావడం లేదు. చిన్న చిన్న సమస్యలకు కూడా ప్రజలు, రైతులు పదే పదే తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎంలతో వందలాది మంది రైతులు ఇబ్బంది పడుతున్నారు. పంట రుణాల రెన్యువల్ సమయంలో వన్‌బీ పత్రాలపై వీఆర్వో సంతకం తప్పనిసరిగా ఉండాలి. రైతులు గోకులం షెడ్లు, మామిడి మొక్కల పెంపకం, ఇతర అనేక పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నా వీఆర్వో సంతకం తప్పనిసరి. ఇంతటి కీలకమైన బాధ్యతలు ఉన్న వీఆర్వోలు ఇన్‌చార్జ్‌లుగా ఉండటంతో ఆయా గ్రామాల్లో పనులు సకాలంలో జరగక ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెగ్యులర్ వీఆర్వోలను నియమించాలని కోరుతున్నారు.

### చుక్కల తొలగింపు కోసం తిరుగుతున్నా..

మాకు బండమీదపల్లి పొలం సర్వే నెంబర్ 391లో ఉన్న దాదాపు 16 ఎకరాల భూమి చుక్కల భూమిగా నమోదైంది. చుక్కల తొలగింపు కోసం మూడు నెలల కిందట తహసీల్దార్ కార్యాలయానికి రికార్డు సమర్పించా. రెగ్యులర్ వీఆర్వో లేకపోవడం, ఇన్‌చార్జ్ వీఆర్వోలు మారుతుండటంతో ఫైలు ముందుకు కదలడం లేదు. ఆ పని కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ పదే పదే తిరుగుతున్నా. రెగ్యులర్ వీఆర్వోను నియమించాలి.

-రామాంజనేయులు, రైతు, బండమీదపల్లి

### ఉన్నతాధికారులకు తెలియజేశాం



వీఆర్వోల కొరత వాస్తవమే. ఐదు రెవెన్యూలకు వీఆర్వోలు లేరు. ఇన్‌చార్జ్‌లే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఒక వీఆర్వో సెలవులో ఉన్నారు. ఇంకొక వీఆర్వో డెప్యుటేషన్‌పై ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లారు. ఉన్న కొంత మంది వీఆర్వోలతోనే ప్రజల పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

-విజయకుమారి, తహసీల్దార్, రాప్తాడు

# పారిశ్రామిక పండగొచ్చింది..!




టేకులోడు వద్ద ఏపీఐఐసీ సేకరించిన భూములు

(5వ పేజీ తరువాయి)

ఉపాధి అవకాశాలు కల్పించనుంది. ఇందుకోసం 47.28 ఎకరాల భూమిని కేటాయించారు. ఈ రెండు యూనిట్ల ద్వారా రూ.940 కోట్ల పెట్టుబడులు రాగా.. 5,496 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ పరిశ్రమల నిర్మాణం 2026 మార్చిలో ప్రారంభమై 2027 మే నెలలో ఉత్పత్తి మొదలు పెట్టనున్నాయి.

### పరిశ్రమలు రావడం సంతోషంగా ఉంది



ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు రేమండ్ కంపెనీ ముందుకు రావడం చాలా సంతోషం. గతంలో పరిశ్రమల ఏర్పాటుకోసం భూసేకరణ చేసి ఏళ్లు గడిచినా ఒక్క పరిశ్రమ రాలేదు. టేకులోడు ప్రాంతాన్ని పారిశ్రామిక వాడగా ఏర్పాటు చేస్తే చిలమత్తూరు మండలంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలన్నీ అభివృద్ధి చెందుతాయి.

-బయపరెడ్డి, ఆరుమాకులపల్లి, చిలమత్తూరు మండలం

### వలస వెళ్లాల్సిన అవసరం ఉండదు



టేకులోడు ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే చదువుకున్న పిల్లలకు ఇక్కడే ఉద్యోగాలు లభిస్తాయి. ఇప్పటికే రోడ్ల పరంగా ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చిందింది. ఇలాంటి చోట పరిశ్రమలు ఏర్పాటైతే ఈ ప్రాంత ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది.

-ఆదినారాయణరెడ్డి, టేకులోడు, చిలమత్తూరు మండలం

### భూములు కోల్పోయినా.. ఉపాధి దొరుకుతుంది



పరిశ్రమల కోసం వ్యవసాయ భూములను ప్రభుత్వానికి ఇచ్చాం. వెంటనే ఇక్కడ రేమండ్ కంపెనీ పరిశ్రమ ఏర్పాటు చ ఏస్తోందని తెలుస్తోంది. దీంతో భూములు కోల్పోయామన్న బాధ లేదు. వెంటనే మాకు ఉపాధి లభించే అవకాశాలు ఉన్నాయి.

-విజయకుమార్, టేకులోడు

### మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

రెమండ్ గ్రూప్ అనుబంధ సంస్థల ఏర్పాటుకు వీలుగా ఆయా పారిశ్రామిక వాడల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. పరిశ్రమల ఏర్పాటుకు భూములను తక్షణమే సిద్ధం చేస్తాం.

-నాగకుమార్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్

# ఉరవకొండకు సౌర వెలుగులు

అనంతపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కరువు జిల్లాకు సౌర వెలుగులు రానున్నాయి. ఉరవకొండ నియోజకవర్గంలో రెండు సోలార్ పవర్ ప్రాజెక్టులు ఏర్పాటుకానున్నాయి. రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. బెళుగుప్ప మండలం ఎర్రగుడి, ఆవులెన్న, శీర్పి, దుద్దేకుంట, అంకంపల్లి, తగ్గపర్తి గ్రామాల పరిధిలో 400 మెగావాట్ల ఏ/సి, 500 మెగావాట్ల డీసీ సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం టాటా పవర్ రెన్యువబుల్ ఎనర్జీ లిమిటెడ్ అభ్యర్థన మేరకు ఆయా ప్రాంతాల్లో సోలార్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ సౌర విద్యుత్ ప్రాజెక్టుల నుంచి 25 సంవత్సరాలకు రూ.120 కోట్ల గ్రీన్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఫండ్ ఉత్పత్తి అవుతుంది. మొదటి 12 సంవత్సరాలకు రూ.1.50 లక్షలు/మెగావాట్ల చొప్పున, మిగిలిన 13 సంవత్సరాలకు గానూ ఏడాదికి రూ.50 వేల చొప్పున స్థానిక ప్రాంత అభివృద్ధి చార్జీలు వసూలు చేస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 1,380 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుంది. ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024 మేరకు వజ్రకరూరు మండలం కమలపాడు, కొనకొండ్ల, గూళ్లపాళ్యం గ్రామాల్లో 600 మెగావాట్లతోపాటు 400 మెగావాట్ల ఏ/సి 580 మెగావాట్ల డీసీ సోలార్ పవర్ ప్రాజెక్ట్ కేటాయింపు కోసం ఊర్జా వన్ ప్రైవేట్ లిమిటెడ్ అభ్యర్థన మేరకు ఆయా ప్రాంతాల్లో సోలార్ పరిశ్రమలు నెలకొల్పేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

### అమలుకానున్న మంత్రి లోకేశ్ హామీ

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకునే విధంగా మంత్రిమండలిలో నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు అనంత జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ నెలకొల్పేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఎక్కడ ఏర్పాటు చేస్తారు, భూముల ఏర్పాటు తదితర అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

# లైవ్ బకాయిలు !

## బీఎస్ఎన్ఎల్‌కు రూ.40 లక్షల బిల్లుల పెండింగ్

● పేరుకు పోయిన ప్రభుత్వ కార్యక్రమాల లైవ్ టెలీకాస్టింగ్ బకాయిలు

● బిల్లుల కోసం కలెక్టర్ల చుట్టూ బీఎస్ఎన్ఎల్ అధికారులు




బీఎస్ఎన్ఎల్ కార్యాలయం

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ సంస్థను మొండి బకాయిలు వేధిస్తున్నాయి. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన లైవ్ టెలికాస్టింగ్ బిల్లులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.40 లక్షల వరకూ బకాయిలు ఉన్నట్లు బీఎస్ఎన్ఎల్ అధికారులు చెబుతున్నారు. ఏ కలెక్టర్‌ను అడిగినా ప్రభుత్వం నుంచి ఫండింగ్ రావాలి అంత వరకూ తామేమీ చేయలేమని చెబుతుండటంతో బీఎస్ఎన్ఎల్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

### పెండింగ్ బిల్లులిలా...

వైసీపీ పాలనలో 2023లో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తికి వచ్చారు. ఆయన పర్యటన లైవ్ కవరేజీ కోసం బీఎస్ఎన్ఎల్‌ను సంప్రదించారు. సీఎం ప్రోగ్రామ్ కావడంతో బీఎస్ఎన్ఎల్ అధికారులు సైతం లైవ్ టెలికాస్టింగ్‌కు అనుమతులిచ్చారు. ఇందుకు రూ.2.20 లక్షలు ఖర్చు అయ్యింది. మరోమారు వైసీపీ హయాంలోనే అనంత జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ కార్యక్రమం లైవ్ కవరేజీ ఖర్చు రూ.12 లక్షల వరకూ వచ్చినట్లు సమాచారం. అనంతరం అధికారులు సంబంధిత జిల్లా కలెక్టర్ వద్దకు బిల్లుల కోసం వెళ్తే ప్రభుత్వం నుంచి నిధులు రాలేదు. వచ్చిన వెంటనే ఇస్తామని చెప్పారు. తర్వాత కొద్ది రోజులకు రాష్ట్రంలో అధికారం మారింది. అయినా బిల్లులు అలాగే ఉండిపోయాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కొలువుదీరాకా శ్రీసత్యసాయి జిల్లాలోని కొత్తచెరువులో సీఎం చంద్రబాబునాయుడు పర్యటించారు. ఆ కార్యక్రమం కవరేజీ ఖర్చు రూ.3 లక్షలు అయ్యింది. అనంతరం అనంతపురంలో జరిగిన మరో కార్యక్రమానికి సంబంధించి రూ.12 లక్షలు, మరోమారు అనంత జిల్లాలోని ఓ నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటించిన కార్యక్రమానికి సంబంధించి రూ.3 లక్షలు, అనంత అర్బన్‌లో తాజాగా నిర్వహించిన సూపర్ సిక్స్-సూపర్ హిట్ కార్యక్రమానికి సంబంధించి రూ.8 లక్షలు బిల్లులు బీఎస్ఎన్ఎల్ సంస్థకు అందాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. కలెక్టరేట్‌లోని కొందరు అధికారులు లైవ్‌టెలీకాస్టింగ్‌కు సంబంధించిన బిల్లులు కలెక్టర్లకు సకాలంలో అందించకపోవడంతోనే చెల్లింపులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

### పెండింగ్ వాస్తవమే



రాష్ట్ర ప్రభుత్వాల కార్యక్రమాలకు సంబంధించిన లైవ్ టెలికాస్టింగ్ బిల్లులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. ఇప్పటికే పలుమార్లు రెండు జిల్లాల కలెక్టరేట్ వర్గాలకు బిల్లులు చెల్లించాలని చెప్పాం. అయినా ఇప్పటి వరకూ క్లియర్ కాలేదు. ఆ బిల్లులు క్లియర్ అయితే బీఎస్ఎన్ఎల్‌ను ఆర్థికపరమైన అంశాలతో అభివృద్ధి చేసే అవకాశం ఉంటుంది.

-ముజీబ్ పాషా, పీజీఎం, బీఎస్ఎన్ఎల్

# జేజేఎంతో తాగునీటి సమస్యకు చెక్

● ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్



సిబ్బందితో సమీక్షిస్తున్న ఎస్ఈ సురేష్

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జల్‌జీవన్ మిషన్ (జేజేఎం) ద్వారా రూ.3,800 కోట్లతో జిల్లాలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్ తెలిపారు. తన చాంబర్‌లో శుక్రవారం ఆయన ఈఈ శ్రీనివాసులుతో కలిసి రాయదుర్గం డీఈ రామారావు, ఉరవకొండ డీఈ అంజుమాన్ సఫ్రీన్‌లతో నీటి పథకాలపై సమీక్షించారు. అనంతరం ఎస్ఈ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న వనరుల ద్వారా ప్రతి గ్రామానికి నీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. పీఏబీఆర్ నుంచి ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం, రాప్తాడు, శింగనమల నియోజకవర్గంలోని కొన్ని మండలాలకు, గండికోట ప్రాజెక్టు నుంచి తాడిపత్రి నియోజకవర్గంతో పాటు శింగనమల నియోజకవర్గంలోని మండలాలకు, మిడ్‌పెన్నార్ డ్యాం నుంచి గుత్తి నియోజకవర్గంతో పాటు శింగనమల నియోజకవర్గానికి నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# రెజ్లింగ్ జట్ల ఎంపిక



అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ రెజ్లింగ్ ఉమ్మడి జిల్లా జట్లను శుక్రవారం ఎంపిక చేశారు. స్థానిక ఆర్డీటీ ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎస్‌జీఎఫ్-14, 17, 19 రెజ్లింగ్ ఉమ్మడి జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన వారి వివరాలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు.

**అండర్-14 బాలురలో...** సాయి, జస్వంత్, వెంకట మనోజ్, కుషాల్, సంజీవ్, యశ్వంత్, ప్రభాస్, ధనుంజయ, రుషివర్ధన్, విశాల్ ఎంపిక య్యారు.

**బాలికల విభాగంలో...** రోజా, మన్షిత, లావణ్య, యశశ్విని, చందన, స్వరూప, చాందిని, శ్లోక, నందిత, కావ్యశ్రీ ఎంపికయ్యారు.

**అండర్-17 బాలుర విభాగంలో..** రామచరణ్ తేజ, రామ్‌చరణ్, నందీష్, గణేష్‌శాంతులు ఎంపికయ్యారు.

**బాలికల విభాగంలో...** అనూషా, యాసిన్, విష్ణుప్రియ, లాస్యరెడ్డి, యశస్విని, స్వరూప, శాలిని, మందారలు ఎంపికయ్యారు.

**అండర్-19 బాలుర విభాగంలో...** శివసాయి, తరుణ్‌కుమార్ రెడ్డి, శరత్, రాజేష్‌ను ఎంపిక చేశారు.

**బాలికల విభాగంలో...** మోక్షిత, శృతి, గౌతమి, కె శైలజ, స్పందన, బి శైలజ, హర్షిత ఎంపికయ్యారు. వీరు ఎస్‌జీఎఫ్ రెజ్లింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని శ్రీనివాసులు తెలిపారు.

# ఉదయం గంట.. మధ్యాహ్నం మరో గంట!

● ఇష్టారాజ్యంగా ఉద్యోగుల హాజరు

● ఎన్‌హెచ్ విభాగంలో కనిపించని సిబ్బంది

● 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో బట్టబయలు

ఆంధ్రజ్యోతి విజిట్



మూసివేసిన ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయం


అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎన్‌హెచ్ (నేషనల్ హైవే) విభాగంలో ఉద్యోగులు ఇష్టారాజ్యంగా పని వేళలు పాటిస్తున్నారు. ఉదయం ఓ గంట, మధ్యాహ్నం మరో గంట మాత్రమే కార్యాలయాల్లో కనిపిస్తున్నారు. ఈఈ, ఎస్ఈలు ఫీల్డ్‌కు వెళ్లారన్న సమాచారం ఉంటే ఆ గంట కూడా కార్యాలయానికి రారన్న విమర్శలు ఉన్నాయి. ఎన్‌హెచ్ విభాగంలోని ఈఈ, ఎస్ఈ కార్యాలయాలను 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం విజిట్ చేసింది. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు సిబ్బంది ఎవరూ కూడా ఆయా కార్యాలయాల పరిసరాల్లో కూడా కనిపించలేదు. సాధారణ రోజుల్లో కూడా మధ్యాహ్నం 12 నుంచి 1 గంటలలోపు, సాయంత్రం 4 నుంచి 5గంటల లోపు మాత్రమే కొందరు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని, అప్పుడు మాత్రమే కార్యాలయానికి రావాలని అక్కడి సిబ్బంది కొందరు పేర్కొన్నారు. ఎన్‌హెచ్ ఎస్ఈగా ఉన్న హరిప్రసాద్‌కు ప్రమోషన్ రావడంతో ఆయన గత నెల 23న రిలీవ్ అయ్యారు. ఇన్‌చార్జ్ బాధ్యతలు ఈఈ సుధాకర్‌రెడ్డికి అప్పగించారు. ఈయన ఎక్కువ శాతం క్షేత్రస్థాయి పర్యటనల్లో ఉంటారన్న ప్రచారం ఉంది. దీంతో సిబ్బంది ఇష్టారీతిన కార్యాలయాలకు వస్తున్నట్లు సమాచారం. ఈఈ కార్యాలయం సమీపంలోని డీఈ డివిజన్ కార్యాలయం పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. అక్కడ అటెండర్ తప్ప మరెవరు కనిపించలేదు.

### ఎస్ఈ కార్యాలయంలో ఖాళీ కుర్చీలు..


ఎస్ఈతో పాటు, డిప్యూటీ ఎస్ఈ, సూపరింటెండెంట్, డివిజన్ కార్యాలయంలో ఏఈ-2, సీనియర్ అసిస్టెంట్లు-2, జూనియర్ అసిస్టెంట్లు-2, టీఓ-1, ఏటీఓ-2 పోస్టులు ఉన్నాయి. ఇంత మంది ఉన్న ఏ ఒక్కరు లేక కార్యాలయం ఖాళీగా కనిపించింది.

### ఈఈ కార్యాలయంలో కనిపించని సిబ్బంది..

ఈఈ సుధాకర్‌రెడ్డితో పాటు పీఏటూ ఈఈ రామచంద్రారెడ్డి, సూపరింటెండెంట్-1, డీఏఓ-1, టీఓ-1, సీనియర్ అసిస్టెంట్లు-3, జూనియర్ అసిస్టెంట్లు-3 అటెండర్లు-4 ఉన్నారు. వీరిలో ఒక వృద్ధురాలైన అటెండర్ తప్ప ఏ ఒక్క సిబ్బంది కనిపించలేదు. దీనిపై ఈఈ సుధాకర్‌రెడ్డిని వివరణ కోరడానికి ఫోన్ ద్వారా ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.



ఖాళీగా ఉన్న ఎస్ఈ డివిజన్ సిబ్బంది కార్యాలయం



ఖాళీగా ఉన్న ఎస్ఈ సర్కిల్ సిబ్బంది కార్యాలయం

# ప్రకృతి సేద్యాన్ని పరిశీలించిన పరదేశీ

## పంటల సాగును తెలుసుకున్న ఇంగ్లాండ్ దేశీయుడు



ప్రకృతి వ్యవసాయంపై మహిళా రైతులతో ఆరాతీస్తున్న క్రిస్టోఫర్

గార్లదిన్నె, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటంక గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని ఇంగ్లాండ్ దేశానికి చెందిన ట్రావెలర్, జర్నలిస్టు, ప్రకృతి ప్రేమికుడు క్రిస్టోఫర్ పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం ప్రోగ్రామ్ మేనేజర్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయనకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన చీనీ, వేరుశనగ, ఆముదం తదితర పంటలను ఆయన పరిశీలించారు. చీనీ పంట సాగులో రైతులు మానస, కిశోర్ వినియోగిస్తున్న సేంద్రియ కర్బనం, వానపాములు, నేల సంతానోత్పత్తి గురించి తెలుసుకున్నారు. వేరుశనగ పంటను పరిశీలించి జీవ వైవిధ్య పంటల వలన కలుగు లాభాలపై ఆరా తీశారు. ఆముదం పంట సాగు గురించి రైతు హేమలతను అడిగి తెలుసుకున్నారు. దుంపజాతి కూరగాయలు, ఆకుకూరలు, పూల ద్వారా రైతు వరలక్ష్మి ఆర్జించిన లాభాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశమై మహిళా రైతులు ప్రకృతి వ్యవసాయం, జీవనోపాధులు ఏవిధంగా అభివృద్ధి చేసుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన ఘన, ద్రవ జీవామృతాల తయారీ విధానాన్ని తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచు లక్ష్మి, ప్రకృతి వ్యవసాయం ఎన్‌ఎఫ్ఏ నందిని, ఎర్రిస్వామి మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ఇక బడిబాట..!

● ముగిసిన కొత్త టీచర్ల నియామక ప్రక్రియ

● నేడు ఉత్తర్వులు..

### సోమవారం నుంచి విధులకు..



బీకేఎస్ శిక్షణ కేంద్రంలో చివరిరోజు కొత్త టీచర్లు

అనంతపురం విద్య, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ద్వారా ఎంపికైన కొత్త టీచర్లు సోమవారం నుంచి బడికి వెళ్లనున్నారు. ఎంపిక ప్రక్రియ, శిక్షణ పూర్తయ్యేందుకు సుమారు నెలన్నర సమయం పట్టింది. స్కూల్ అసిస్టెంట్లకు వెబ్ కౌన్సెలింగ్, ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా స్థానాలను కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో 748 మంది టీచర్ ఉద్యోగాలు సాధించారు. ఎస్జీటీలో తెలుగు 146 మంది, ఉర్దూ 14 మంది, కన్నడ ఐదుగురు, స్కూల్ అసిస్టెంట్లలో తెలుగు 101 మంది, హిందీ 26 మంది, ఇంగ్లిష్ 25 మంది, ఉర్దూ ఐదుగురు, బయాలజికల్ సైన్స్ 70 మంది, ఫిజికల్ సైన్స్ 64 మంది, గణితం 41 మంది, పీడీలు 142 మంది, సోషల్ స్టడీస్ 108మంది, సోషల్ స్టడీస్ ఉర్దూ ఒక్కరు ఉన్నారు. వీరికి కేటాయించిన పాఠశాలల ఆర్డర్లు శనివారం వస్తాయని డీఈఓ ప్రసాద్ బాబు తెలిపారు. కొత్త టీచర్లు 13వ తేదీ సోమవారం విధుల్లో చేరాల్సి ఉంటుందని అన్నారు.

### ముగిసిన శిక్షణ

కొత్త టీచర్లకు శిక్షణ శుక్రవారం ముగిసింది. అనంతపురం, కర్నూలు జిల్లాకు చెందిన టీచర్లకు బుక్కరాయసముద్రంలోని విజయభారతి డీఎడ్ కాలేజీ, కొర్రపాడు వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ శిక్షణా కేంద్రం, పంగల్ రోడ్డులోని వివేకానంద జూనియర్ కాలేజీలో శిక్షణ ఇచ్చారు. సమస్యలు తలెత్తకుండా విద్యాశాఖ జాయింట్ డైరెక్టరు సుబ్బారావు, డీఈఓ ప్రసాద్‌బాబు, ఎస్ఎస్ఏ ఏపీసీ శైలజ పర్యవేక్షించారు. కొత్త టీచర్లకు పలు సూచనలు చేసారు. శిక్షణా కేంద్రాలలో చివరి రోజు అధికారులు, శిక్షకులు, కొత్త టీచర్లు గ్రూప్ ఫొటోలను తీసుకుంటూ సందడి చేశారు.

### మీరంటే చాలా ఇష్టం..

శిక్షణ ముగియడంతో విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు వర్చ్యువల్‌గా సందేశం ఇచ్చారు. డీఎస్సీ-2025 టీచర్లంటే తనకెంతో ఇష్టమని అన్నారు. నియామక ప్రక్రియలో ఎలాంటి లోపాలు, రాజకీయాలకు తావులేకుండా చూసుకున్నామని అన్నారు. పాఠశాలలకు వెళ్లి చాలా బాధ్యతగా పనిచేసి, మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సమస్యలు ఉంటే నేరుగా తనను కలిసి తెలియజేయవచ్చని, పరిశీలించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

# ఐద్వా పోరాటాలు అమోఘం


● ఎస్ఎస్‌బీఎన్ విద్యాసంస్థల కార్యదర్శి నిర్మలమ్మ



మాట్లాడుతున్న ఎస్ఎస్‌బీఎన్ విద్యాసంస్థల కార్యదర్శి నిర్మలమ్మ


అనంతపురం టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళల హక్కుల రక్షణకు ఐద్వా చేస్తున్న పోరాటాలు అమోఘమని ఎస్ఎస్‌బీఎన్ విద్యాసంస్థల కార్యదర్శి నిర్మలమ్మ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కృష్ణకళామందిర్‌లో ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంస్కృతికోత్సవాలు రెండోరోజు శుక్రవారం కొనసాగాయి. కార్యక్రమానికి నిర్మలమ్మ, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రమ్మ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డ్రగ్ ఫ్రీ ఇండియా లఘుచిత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం నిర్మలమ్మ మాట్లాడుతూ మహిళా సమస్యలపై ఐద్వా అనేక ఉద్యమాలు చేపట్టి, హక్కుల రక్షణ కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి, చట్టాలు రూపొందించేలా చేసిందన్నారు. సావిత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడ మహిళలపై దాడులు జరిగినా ముందుండి న్యాయంకోసం పోరాడుతున్నది ఐద్వానేనని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షకార్యదర్శులు శ్యామల, చంద్రిక, నగర కార్యదర్శి అశ్విని, శైలజ, గీతా, రామాంజినమ్మ, షేక్ రియాజుద్దీన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

### చీనీ టన్ను రూ.15 వేలు



అనంతపురం రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.15వేలుతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 72 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

### టమోటా కిలో రూ.19



అనంతపురం రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టామోటా గరిష్ఠంగా రూ.19తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మార్కెట్‌కు 1650 టన్నుల టమోటా కాయలు వచ్చాయన్నారు. కిలో కనిష్ఠ ధర రూ.10, సరాసరి ధర రూ.14తో విక్రయాలు జరిగాయన్నారు.

## చిరు చిరు జల్లులు

నడిరేయి మబ్బులతో
అనంత ఆకాశ వీధులు
మరింత నల్లబడి.. చల్లబడ్డాయి..!

వేకువనే
చినుకులు మొదలై..
పొద్దెక్కేదాకా రాలుతూనే ఉన్నై..!

వానా.. నువ్వొచ్చావని
బడిని మూసేస్తారా ఏమిటి..?
అన్నింటినీ ఆపేస్తారా ఏమిటి..?

వెళ్లాల్సిందే..!
అమ్మ చెంగుచాటునో..
నాన్నతో గొడుగు చాటునో..

అయినా బాగుంది..
చిటపట చినుకులు
ముఖాన కొడుతూ ఉంటే..!

(అనంతపురం నగరంలో
శుక్రవారం ఉదయం)
- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి







పట్టు తప్పితే ప్రమాదం కదా..?



తప్పదు.. వెళ్లాల్సిందే బడికి..



తల తడిస్తే జలుబు చేస్తుంది కన్నా..



బంగారు తల్లి.. భద్రంగా చూసుకుంటోంది..



గొడుగుతో డ్రైవింగ్.. ప్రమాదం సారూ..

## పోస్టుమార్టంలో నిర్లక్ష్యంపై నిరసన



ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

ఉరవకొండ, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): యువకుడికి పోస్టుమార్టం విషయంలో వైద్యుల నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ కుటుంబ సభ్యులు.. స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. మండలంలోని లత్తవరం గ్రామ శివారు హంద్రీనీవా కాలువ వద్ద యువకుడు మహేష్ అనుమానాస్పద స్థితిలో గురువారం రాత్రి మృతిచెందాడు. ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మహేష్ మృతిపై అనుమానం ఉందనీ, పోస్టుమార్టం పక్కాగా నిర్వహించాలని అతడి కుటుంబ సభ్యులు.. వైద్యులను కోరారు. పోస్టుమార్టం పక్కాగా చేయాలంటే అనంతపురంలో సాధ్యమవుతుందని డాక్టర్ చెప్పడంతో బాధితులు ఆగ్రహానికి లోనయ్యారు. వైద్యుడి నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఆస్పత్రి ఎదుట వారు ఆందోళన చేశారు. అనంతపురం-గుంతకల్లు రహదారి కావడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. పోస్టుమార్టం చేసేందుకు వైద్యులు అంగీకరించారు. మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

## భార్య పుట్టింటికెళ్లిందని భర్త ఆత్మహత్య



కృష్ణమూర్తి (ఫైల్)

ఉరవకొండ, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): భార్య పుట్టింటికెళ్లిందన్న మనస్తాపంతో పట్టణంలోని లాల్ స్వామి గుడి సమీపాన నివాసం ఉంటున్న కృష్ణమూర్తి(31) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కృష్ణమూర్తికి పదేళ్ల క్రితం అనంతపురానికి చెందిన నీలిమతో వివాహమైంది. పదిరోజుల క్రితం ఆమె ఇంట్లో చెప్పకుండా పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన కృష్ణమూర్తి ఇంట్లో ఉరేసుకుని, ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తలుపులు తెరవకపోవడంతో కిటికీలోంచి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే తలుపులు బద్దలుకొట్టి, మృతదేహాన్ని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కృష్ణమూర్తికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

## రైతు ఖాతా నుంచి రూ.లక్ష స్వాహా

### సైబర్ మోసంపై బాధితుడి ఫిర్యాదు



బాధిత రైతు రామానాయుడు

బొమ్మనహాళ్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ రైతు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.లక్ష దోచుకున్నారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని కోళగానహళ్లి గ్రామానికి చెందిన రైతు కావలి రామానాయుడు బ్యాంకు ఖాతా నుంచి ఈనెల 9వ తేదీన సాయంత్రం రూ.19,999 చొప్పున ఐదుసార్లు మొత్తం లక్ష రూపాయలను సైబర్ నేరగాళ్లు దోచుకున్నారు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామానాయుడు ఫోన్ నంబరుకు రెండ్రోజుల క్రితం ఓ మెసేజ్ వచ్చింది. దానిపై క్లిక్ చేశారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం ఐదుసార్లు డబ్బు బదిలీ అయినట్లు రైతు ఫోన్‌కు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో శుక్రవారం ఉదయాన్నే రైతు.. బ్యాంకుకెళ్లి ఆరాతీశాడు. సైబర్ మోసం అని తెలియడంతో పోలీసులను ఆశ్రయించాడు.

## అంగన్‌వాడీ కార్యకర్త ఆత్మహత్య



శిల్ప మృతికి సంతాపం తెలుపుతున్న సీడీపీఓ, అంగన్‌వాడీలు

సోమందేపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లాపల్లిలో అంగన్‌వాడీ కార్యకర్త శిల్ప(32) శుక్రవారం ఇంట్లోనే ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బెంగళూరుకు చెందిన శిల్పకు చల్లాపల్లి వాసి నరేష్‌తో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. శిల్ప ఇటీవల పుట్టినిట్లు బెంగళూరు వెళ్లింది. నాలుగు రోజుల క్రితం చల్లాపల్లికి వచ్చింది. అప్పట్నుంచి ముభావంగా ఉండేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఉదయం స్నానానికి వెళ్లి, ఉరేసుకుంది. ఎంతసేపటికీ రాకపోవడంతో కుటుంబికులకు అనుమానం వచ్చి చూశారు. ఉరికి వేలాడుతూ కనిపించింది. తలుపు బద్దలుకొట్టి చూడగా.. అప్పటికే మరణించింది. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టంకి తరలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపారు. శిల్ప మృతికి సీడీపీఓ శాంతలక్ష్మి, సూపర్‌వైజర్ శోభ, అంగన్‌వాడీ కార్మికుల సంఘం జిల్లా నేత శ్రీదేవి నివాళులు అర్పించారు.

## వృద్ధురాలి నేత్రాలు దానం



గూడూరు సరోజమ్మ (ఫైల్)

ధర్మవరం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక యాదవవీధికి చెందిన గూడూరు సరోజమ్మ(80) శుక్రవారం ఉదయం మృతిచెందగా.. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. మృతురాలి కుటుంబసభ్యులకు నేత్రదానంపై విశ్వదీప సేవాసంఘం సభ్యులు అవగాహన కల్పించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, అనంతపురం రెడ్ క్రాస్ సొసైటీ డీవై కుళ్లాయప్ప కంటి రెట్రావల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర కళ్లను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన మృతురాలి కుటుంబ సభ్యులను అభినందించారు.

# ఉమ్మడి జిల్లాకు పీఎండీడీకేవై

### వ్యవసాయానికి ఊరట... రైతాంగానికి భరోసా
### సీఎం చంద్రబాబు దార్శనికత...
### మంత్రి కేశవ్ చొరవతోనే..

అనంతపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దర్శనికత, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కృషితో ఉమ్మడి జిల్లాలో పీఎండీడీకేవై అమలు కానుంది. దేశవ్యాప్తంగా వంద జిల్లాలో ఈ నూతన పథకాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే తొలుత అనంత ఉమ్మడి జిల్లాకు ఈ వంద జిల్లాల జాబితాలో చోటు దక్కలేదు. పీఎండీడీకేవై (ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన) పరిధిలోకి ఉమ్మడి జిల్లాను చేరిస్తే జిల్లా రైతాంగానికి ఒక భరోసా లభిస్తుందని మంత్రి పయ్యావుల కేశవ్ ఆలోచన చేశారు. ఇటీవల శ్రీ సత్యసాయి జిల్లాలోని నాసిన్ అకాడమీకి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వచ్చిన సమయంలో పీఎండీడీకేవైని అనంత ఉమ్మడి జిల్లాలో అమలు చేయాలని విన్నవించారు. కేంద్ర పథకం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించారు. సీఎం ఢిల్లీ వెళ్లిన పలు సందర్భాల్లోనూ ఆయన వెంటే వెళ్లిన మంత్రి కేశవ్ కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్‌ను కలిసి జిల్లా రైతాంగం పడుతున్న బాధలను వివరించారు. ఉమ్మడి జిల్లాను ప్రధానమంత్రి ధన ధాన్య కృషియోజనలో చేర్చాలని విన్నవించారు. దీనికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పీఎండీడీకేవైను ఉమ్మడి అనంత జిల్లాకు వర్తింపజేసింది.

### రైతాంగానికి ఊరట

పీఎండీడీకేవై ద్వారా ఉమ్మడి అనంత జిల్లా రైతాంగానికి ఎంతో మేలు కలగనుంది. వ్యవసాయ ఉత్పాదకతను పెంచడంతో పాటు వ్యవసాయంలో స్థిరమైన పద్ధతులను ప్రోత్సహించడం, రైతాంగం జీవనోపాధిని మెరుగుపరచడం లక్ష్యంగా ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తెచ్చింది. ఈ పథకానికి పశుసంపద, పాడిపరిశ్రమ, మత్స్యసంపద తదితర అనుబంధ రంగాలను అనుసంధానించి స్థానిక జీవనోపాధికి ఇతోధికంగా కృషి చేస్తారు. పంటకోత తరువాత నిల్వ, మెరుగైన నీటిపారుదల, సులభతర రుణ సదుపాయం, సహజ, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, గ్రామీణ ఆర్థిక స్థితిని పెంచడం ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన ముఖ్య ఉద్దేశ్యం. వరుస కరువులతో నష్టపోతున్న ఉమ్మడి జిల్లా రైతాంగానికి ఈ పథకం ఎంతో ఊరట ఇవ్వనుంది.

### నేడు ప్రారంభం

అనంతపురం అర్బన్: ప్రధాన మంత్రి ధన ధాన్య కృషి యోజనను ప్రధాని నరేంద్రమోదీ వర్చ్యువల్‌గా ఢిల్లీ నుంచి శనివారం ప్రారంభించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. దేశంలోని 100 జిల్లాల్లో ఈ పథకాన్ని అమలు చేస్తారన్నారు. రాష్ట్రంలో 4 జిల్లాలు ఎంపికవగా అందులో ఉమ్మడి అనంత జిల్లా కూడా ఉందన్నారు. ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జరిగే పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కలెక్టర్, జిల్లా అధికారులు, రైతులు పాల్గొంటారన్నారు.

## బీటీపీని పరిశీలించిన కలెక్టర్



బీటీ ప్రాజెక్టు స్థితిగతులను తెలుసుకుంటున్న కలెక్టర్

గుమ్మఘట్ట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బీటీపీ (భైరవానితిప్ప ప్రాజెక్టు)ని కలెక్టర్ ఆనంద్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బీటీ ప్రాజెక్టు క్రస్ట్‌గేట్ల మోటార్లు, మరమ్మతులు, ప్రాజెక్టు స్థితిగతులపై మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథ్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పైభాగంలో క్రస్ట్‌గేట్లను ఎత్తే మోటార్లను పరిశీలించారు. ఈయన వెంట తహసీల్దార్ రజాక్‌వలి, ఆర్ఐ రామాంజినేయులు, పలువురు రైతులు ఉన్నారు.

### ఎంజేపీ స్కూల్ తనిఖీ

మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల విద్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరుశాతాన్ని, రికార్డులను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాల గురించి బాలికలను అడిగి తెలుసుకున్నారు. బాలికలకు సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీదేవిని ఆదేశించారు.

## క్విజ్ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా నిర్వహించే వికసిత్ భారత్-2047 క్విజ్ పోటీలకు యువత దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారి రవిశంకర్ తెలిపారు. ఈనెల 15లోపు ఆన్‌లైన్‌లో మై భారత్ పోర్టల్‌లో ఆసక్తి ఉన్న యువత తమ పేర్లను దరఖాస్తు చేసుకోవాలన్నారు. 15-29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ, యువకులు అర్హులన్నారు. 12 భాషల్లో మల్టిపుల్ చాయిస్ పద్ధతిలో క్విజ్ పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు వచ్చే ఏడాది న్యూఢిల్లీలో నిర్వహించే జాతీయ యువజన దినోత్సవాల్లో పాల్గొనే అవకాశం లభిస్తుంది. వివరాలకు సెల్ నంబరు 9849913062ను సంప్రదించాలని కోరారు. క్విజ్ పోటీల దరఖాస్తుకు వెబ్‌సైట్: http://mybharat.gov.in/pages/vbyld2026

## నంది విగ్రహం అపహరణ

పెద్దవడుగూరు, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరన్నపల్లిలో గల ఆంజనేయస్వామి గుడి బయట ఉన్న రాతి నంది విగ్రహాన్ని గురువారం అర్ధరాత్రి దుండగులు అపహరించారు. ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆలయంలోకి చొరబడిన దుండగులు నంది విగ్రహాన్ని పెకలించుకు వెళ్లారు. శుక్రవారం ఉదయం గుర్తించిన ఆలయ పూజారి ఆదిశేషయ్య.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. చోరీపై గ్రామంలో పోలీసులు విచారించారు.



నంది విగ్రహం (ఫైల్)

## నాయనా.. జాగ్రత్త..!

**మృత్యువులోనూ బిడ్డ కోసం**
**అమ్మ ఆక్రందన**
**కూలి ప్రయాణంలో కుదుపు..**
**బతుకు బండి వాలింది..**
**ప్రమాదం వచ్చి పడింది..**
**నాయనా.. జాగ్రత్త.. అంటూ..**
**అమ్మ కేక వేసింది..**
**బిడ్డకేమవుతుందోనని**
**తల్లి గుండె తల్లడిల్లింది..**
**తన ప్రాణం గురించే..**
**మరచిపోయింది..**
**ప్రమాదంలో అమ్మ చనిపోయింది..**
**అమ్మ ప్రేమను బతికించింది..**



మల్లిశెట్టి నాగలక్ష్మి (ఫైల్)



ప్రమాదస్థలంలో నాగలక్ష్మి మృతదేహం

శింగనమల, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): మృత్యువు చుట్టుముట్టిన సమయంలోనూ తల్లి తన ప్రాణం గురించి ఆలోచించకుండా కన్నబిడ్డ కోసం తల్లడిల్లిపోయింది. ప్రమాద సమయంలో 'నాయనా.. జాగ్రత్త..' అంటూ బిడ్డకు ఏమీ కాకూడదని భయం నిండిన గొంతుతో కేక వేసిన అమ్మే చనిపోయింది. గార్లదిన్నె మండలం గుడ్డాలపల్లి రైల్వే బ్రిడ్జి వద్ద శుక్రవారం వేరుశనగ నూర్పిడి యంత్రం బోల్తాపడిన ప్రమాదంలో మహిళా కూలీ మల్లిశెట్టి నాగలక్ష్మి(35) దుర్మరణం చెందింది. యంత్రం అదుపు తప్పి పడిపోతుండగా.. ఆమె అదే వాహనంపై ఉన్న కుమారుడు వసంత్‌కుమార్‌కు ఏమవుతుందోనని ఆందోళన చెందింది. కుమారుడికి జాగ్రత్త చెప్పింది. రెండు నిమిషాల్లోనే ఆమె చనిపోయింది. వసంత్‌కుమార్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. 'అమ్మా.. లేమ్మా.. ఇప్పుడే కదా.. జాగ్రత్త అన్నావు. రెండు నిమిషాల్లో మమ్మల్ని వదిలిపెట్టి పోతివా..' అంటూ నాగలక్ష్మి మృతదేహంపై పడి కుమారుడు వసంత్‌కుమార్ బోరున విలపించాడు. ప్రమాదంలో మరో కూలీ రంగస్వామి తీవ్రంగా గాయపడ్డాడు. మరికొందరు కూలీలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

### కూలి కోసం వెళ్తూ..

పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శింగనమల మండలం తరిమెల గ్రామానికి చెందిన 11 మంది కూలీలు శుక్రవారం మధ్యాహ్నం చింతమేకలపల్లికి చెందిన రైతు వేరుశనగ పంట నూర్పిడి పనులకు బయల్దేరారు. నూర్పిడి యంత్రంపై కూర్చుని వెళ్తున్నారు. గార్లదిన్నె మండలం గుడ్డాలపల్లి రైల్వే బ్రిడ్జి వద్దకు వెళ్లగానే.. యంత్రం అదుపు తప్పి రోడ్డుపై బోల్తాపడింది. దానిపై కూర్చుని ప్రయాణిస్తున్న కూలీలు కింద పడ్డారు. మల్లిశెట్టి నాగలక్ష్మి, రంగస్వామి మీద యంత్రం పడింది. నాగలక్ష్మి తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతిచెందింది. రంగస్వామికి కాళ్లు, చేతులు విరిగిపోవడంతో పరిస్థితి విషమంగా ఉంది. అనంతపురం ఆస్పత్రికి తరలించారు. నాగలక్ష్మికి భర్త ఈశ్వరయ్య, కూమారుడు వసంత్‌కుమార్, కుమార్తె అవంతిక ఉన్నారు. ప్రమాదంపై గార్లదిన్నె పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

### రెండు నెలల క్రితమే స్వగ్రామానికి..

నాగలక్ష్మి, ఈశ్వరయ్య దంపతులు తిరుపతికి గతంలో వలస వెళ్లారు. అక్కడ హోటల్‌లో పనిచేస్తుండేవారు. వర్షాలు కురుస్తుండడంతో హోటల్ పనులులేక రెండు నెలల క్రితం స్వగ్రామం తరిమెలకు వచ్చారు. వ్యవసాయ కూలి పనులకు వెళ్తుండేవారు. ఈ క్రమంలోనే శుక్రవారం నాగలక్ష్మి, కుమారుడు వసంత్‌కుమార్ వేరుశనగ నూర్పిడి పనులకు వెళ్లారు. యంత్రం బోల్తాపడి నాగలక్ష్మి మృతి చెందగా.. కుమారుడు సల్పగాయాలతో బయటపడ్డాడు.

## మహాసభలను జయప్రదం చేయండి

### ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి



రాష్ట్ర మహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకురాళ్లు

అనంతపురం టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అనంతపురం కేంద్రంగా ఈనెల 13, 14, 15వ తేదీల్లో నిర్వహించనున్న ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి సావిత్రి పిలుపునిచ్చారు. స్థానిక గణేనాయక్ భవన్‌లో మహాసభల పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె సంఘం ఏర్పాటు, మార్పులు, పోరాటాలు తదితరాల గురించి వివరించారు. ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్న మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్యామల, చంద్రిక, నగర కార్యదర్శి అశ్విని, జిల్లా నాయకురాళ్లు రామాంజినమ్మ, అక్కమ్మ, వెంకటరమణమ్మ, సునంద, కృష్ణవేణి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల బిల్లును ఉపసంహరించాలి

### - ఏఐఆర్ఆర్ఎఫ్



డీఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏఐఆర్ఆర్ఎఫ్ నాయకులు

గుంతకల్లు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు వ్యతిరేకంగా పార్లమెంటులో ఆమోదించిన ఆర్థిక బిల్లును ఉపసంహరించుకోవాలని ఆలిండియా రిటైర్డు రైల్వేమెన్స్ ఫెడరేషన్ (ఏఐఆర్ఆర్ఎఫ్) అధ్యక్ష కార్యదర్శులు జి.జయంత్‌కుమార్, వి. సుంకప్ప డిమాండ్ చేశారు. రైల్వే విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలంటూ ఏఐఆర్ఆర్ఎఫ్, కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళనా కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని ఏఐఆర్ఆర్ఎఫ్ కార్యాలయం నుంచి డీఆర్ఎం కార్యాలయం వరకూ ర్యాలీ చేసి, ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జయంత్ కుమార్, సుంకప్ప మాట్లాడుతూ పెన్షనర్లకు కరోనా కాలంలో పెండింగులో ఉంచిన 18 నెలల డీఏను వెంటనే చెల్లించాలని, కమ్యుటేషన్ కాలాన్ని 15 ఏళ్ల నుంచి 12 ఏళ్లకు కుదించాలని, రిటైర్మెంటు తేదీ ఆధారంగా పెన్షనర్లను విభజించరాదని డిమాండ్ చేశారు. 8వ పే రివిజన్ కమిషన్ ప్రయోజనాలను కార్మికులు, రిటైర్డు ఉద్యోగులకు సమానంగా వర్తింపజేయాలని కోరుతూ ఏడీఆర్ఎం సుధాకర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఐఆర్ఆర్ఎఫ్ ఏడీఎస్ సీబీ సత్య విజయరాజు, కోశాధికారి జీ వీరన్న, వెంకటరమణ, ఖాజా హుస్సేన్, కృష్ణమూర్తి, కుమార్ వేలు, పద్మనాభం పాల్గొన్నారు.

## లా పరీక్ష ఫలితాలు విడుదల

అనంతపురంరూరల్, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన లా కోర్సు రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలను వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు శుక్రవారం విడుదల చేశారు. యూజీ ఆరు, పది సెమిస్టర్ల రెగ్యులర్, సప్లిమెంటరీ, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, పదో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేశారు. కార్యక్రమంలో లా విభాగాధిపతి శ్రీరాములు, పరీక్షల విభాగ డైరెక్టర్ జీవీ రమణ, ప్రొఫెసర్ శోభలత, పరీక్షల కంట్రోలర్ శ్రీరామ్‌నాయక్, సూపరింటెండెంట్ లక్ష్మణ రావు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

## శాస్త్రోక్తంగా సంకష్ట చతుర్థి పూజలు


లక్ష్మీగణపతి మందిరంలో పూజలందుకుంటున్న గణనాథుడు

అనంతపురం టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఆశ్వీయుజ బహుళ చవితిని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం నగరంలోని పలు ఆలయాల్లో సంకష్ట చతుర్థి పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మూడవరోడ్డు షిర్డీసాయి ఆలయం, మల్లేశ్వరరోడ్డులోని లక్ష్మీగణపతి మందిరం, తిలక్ రోడ్డు రామాలయం తదితర ఆలయాల్లో గణనాథునికి ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు చేశారు. ఆయా ఆలయాల కార్యవర్గాలు, భక్తులు పాల్గొన్నారు.

## యల్లమ్మకు..


యల్లమ్మకు ఘటం మోస్తున్న భక్తులు

రామగిరి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కానగులకుంట, రామగిరి గ్రామాల్లో వెలసిన యల్లమ్మ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కానగులకుంటలో భక్తులు కల్లుఘటం, ఊయల, పూలగంటలతో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. రామగిరిలో అమ్మవారి ఆలయంలో ఆకుపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు.

## భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు

అనంతపురం టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఆశ్వీయుజ మాసం శుక్రవారాన్ని పురస్కరించుకుని హెచ్చెల్సీ కాలనీ ససనకోట ముత్యాలమ్మ ఆలయంలో సామూహిక కుంకుమార్చనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ససనకోట ముత్యాలమ్మకు ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు చేయడంతోపాటు ఆలయ ఆవరణలో వేదమంత్రోచ్చారణల నడుమ మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు చేశారు. ఆలయ నిర్వాహకులు గురుశేఖర్‌బాబు, బిందుప్రియ, భక్తులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ వైద్యసేవలు పునరుద్ధరించాలి: సీపీఐ



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

అనంతపురం విద్య, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బకాయిలు చెల్లించాలని కార్పొరేట్,ప్రైవేట్ ఆస్పత్రులు ఎన్టీఆర్ ఉచిత వైద్యసేవలు నిలపడం సరికాదని, వెంటనే పునరుద్ధరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద ఎన్టీఆర్ వైద్యసేవలను పునరుద్ధరించాలని సీపీఐ నాయకులు నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు చెల్లించలేదని ఆరోగ్య సేవలు నిలిపేయడం బాధాకరమన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ మలోలను కలిసి వినతి పత్రం అందించారు. మల్లికార్జున, రాజారెడ్డి, రామక్రి ష్ణ, శ్రీరాములు, లింగమయ్య, రమణ రమేష్, కుళ్లాయిస్వామి, కృష్ణుడు, అల్లీపీరా, ఆనంద్, శ్రీకాంత్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడిపై దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం విద్య, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా గోనేగండ్ల మండలం గాజులదిన్నె ప్రాథమికపాఠశాలలో పనిచేస్తున్న టీచర్ బసవరాజుపై విద్యార్థి తండ్రి దాడిచేయడం దుర్మార్గమని, అతనిపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పిల్లలకు భయం లేదు, తల్లిదండ్రులకు బాధ్యత లేదు, ఇలాంటి పరిస్థితిల్లో మళ్లీ దాడులతో పాఠశాలలో టీచర్లు పనిచేయడానికి భయపడుతున్నారన్నారు. ప్రభుత్వం సీరియస్‌గా తీసుకొని దాడిచేసిన విద్యార్థి తండ్రిపై కఠినచర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్(హెచ్) జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస నాయక్, ఎస్టీయూ రమణారెడ్డి, రామాంజనేయులు, ఏపీటీఎఫ్ రాయలవెంకటేష్, సిరాజుద్దీన్, ఆప్టా వెంకటరత్నం, గోపాల్‌రెడ్డి శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు.

## ఏపీపీఎస్సీ చైర్మన్‌ను కలిసిన టీడీపీ నాయకుడు

అనంతపురం రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ ఇన్‌చార్జి చైర్మన్‌గా సి. శశిధర్ నియమితులైన విషయం తెలిసింది. శుక్రవారం ఆయన నివాసంలో టీడీపీ నాయకుడు సింగవరం రవి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## వేరుశనగ రైతులను ఆదుకోవాలి

రాప్తాడు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో గురు, శుక్రవారాల్లో కురిసిన వర్షాలకు వేరుశనగ పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. లింగనపల్లి గ్రామంలో రైతు సాయినాథ్‌రెడ్డికి చెందిన 5 ఎకరాల్లోని వేరుశనగ వర్షానికి తడవగా శుక్రవారం నాయకులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వేరుశనగ పంట తడిసి రైతులకు తీవ్ర నష్టం కలిగిందన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. పోతులయ్య, రైతులు పాల్గొన్నారు.

## వాటర్‌షెడ్ పనులపై దృష్టి పెట్టాలి: పీడీ

అనంతపురం అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 7 ప్రాజెక్టుల్లో వాటర్ షెడ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని డ్వామా పీడీ సలీం బాషా ఆదేశించారు. శుక్రవారం స్థానిక డ్వామా సమావేశపు హాల్‌లో వాటర్ షెడ్ ఏపీడీ సుధాకర్‌రెడ్డితో కలిసి అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రాజెక్టుల వారిగా ఇప్పటి దాకా చేపట్టిన పనులు, పెండింగ్ పనులపై ఆరా తీశారు. వచ్చే మూడు నెలల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణ చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్త టీచర్లకు జీఓ బుక్స్ పంపిణీ

అనంతపురం విద్య, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025లో ఉద్యోగాలు సాధించిన టీచర్లకు సర్వీస్ జీఓ బుక్స్‌ను పీఆర్‌టీయూ సంఘం నాయకులు అందజేశారు. శుక్రవారం కొత్త టీచర్లకు శిక్షణ ముగియడంతో ఆయాకేంద్రాలకు నాయకులు రామక్రిష్ణారెడ్డి, తిమ్మారెడ్డి, రామమూర్తి, వెంకటనారాయణరెడ్డి వెళ్లి సర్వీస్‌పుస్తకాలను అందజేశారు. తమ వృత్తికి సంబంధించిన ఉపయోగకర మెటీరియల్ ఇవ్వడంపట్ల కొత్తటీచర్లు ఆనందంవ్యక్తం చేశారు.


కొత్తటీచర్లకు జీఓ బుక్స్ అందజేస్తున్న పీఆర్‌టీయూ నేతలు

# అరవై అడుగుల రోడ్డు.. ఆరడుగులు మిగిల్చారు..!

● హౌసింగ్‌బోర్డులో ఆక్రమణల పర్వం


రోడ్డును ఆక్రమించుకోవడంతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అరవై అడుగుల రోడ్డులో ఆరడుగులు మాత్రమే వదిలి, మిగిలిన దాన్ని ఆక్రమించేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నగరపాలక సంస్థ రోడ్డును ఆక్రమించుకుని ఇరుకుగా చేశారు. ఇదీ హౌసింగ్‌బోర్డులోని ఎల్ఐజీ బస్టాప్ రోడ్డు దుస్థితి. హౌసింగ్‌బోర్డు మెయిన్‌రోడ్డు నుంచి ఆదర్శనగర్‌వైపుకు వెళ్లే ప్రధాన రహదారి ప్లానింగ్‌లో 60 అడుగులుగా ఉంది. నిబంధనల ప్రకారం కనీసం ఐదు అడుగులు వదిలి మురుగు కాలవలోపలికే భవనాలు నిర్మించుకోవాలి. ఇక్కడ మాత్రం అందుకు విరుద్ధంగా రోడ్డుపైకే 10-15 అడుగుల మేర మురుగు కాలవ దాటి ముందుకు నిర్మించుకున్నారు. కనీస బాధ్యత లేకుండా యథేచ్ఛగా ఆక్రమించేశారు. దీంతో 60అడుగుల రోడ్డు కాస్తా ఆరడుగులుగా మారింది. పాదచారులు, వాహనదారులు అటు ఇటుగా రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. రోడ్డు విస్తరణ చేపట్టాలని ఇప్పటికే పలువురు స్థానికులు ఏఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు.

# లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకెళ్లాలి

● ఎమ్మెల్యే పరిటాల సునీత


మోడల్ స్కూల్ విద్యార్థినులతో ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బాలికలు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువులో బాగా రాణించాలని ఎమ్మెల్యే పరిటాలసునీత అన్నారు. చెన్నేకొత్తపల్లిలోని మోడల్ స్కూల్‌లో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ధర్మవరం ఆర్డీఓ మహేశ్‌తో కలిసి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం బాలికల విద్యను ప్రోత్సహిస్తూ ఎన్నో సౌకర్యాలు కల్పిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. మీరు కూడా ఎందులోనూ తక్కువ కాదని ఎవరో ఏదో అనుకుంటారని అపోహ చెందకుండా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఒకప్పుడు తాను వంటింటికే పరిమితమయ్యాయని, అనుకోని పరిస్థితుల్లో భర్త మరణంతో రాజకీయాల్లోకి రావాల్సి వచ్చిందన్నారు. రాజకీయాల్లోకి అడుగుపెట్టి మంత్రిగా ఎమ్మెల్యేగా పనిచేశానన్నారు. బాలికలుచిన్న వయస్సు కావడంతో కొందరు మాటలువిని పక్కదారి పట్టే అవకాశం లేకపోలేదని, జాగ్రత్త వహిస్తూ చదువుకోవాలన్నారు. అనంతరం కేజీబీవీలో రూ.2.25కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న ఇంటర్ అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని ఆమె పరిశీలించి నాణ్యత విషయంలో రాజీపడొద్దని, త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఎస్‌ఓ మురళీ, సీడీపీఓ కవితాదేవి, ప్రిన్సిపాళ్లు స్వర్ణలత, సువర్ణ, తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎంపీడీఓ బాలకృష్ణుడు, ఎంఈఓ ప్రసూన్‌కుమార్‌నాయుడు, ఈఓఆర్‌డీ అశోక్‌నాయక్, టీడీపీ కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అంకే అమరేంద్ర పాల్గొన్నారు.

### విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే

కనగానపల్లి(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపల్లి గ్రామంలో కోదండరామ ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొన్నారు. శుక్రవారం విగ్రహాలను ఊరేగింపు నిర్వహించి, మహిళలు బోనాలు సమర్పించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొని ధ్వజస్తంభానికి పూజలు చేశారు. ఆమె వెంట డీసీఎంఎస్, మార్కెట్‌యార్డ్ చైర్మన్‌లు నెట్టెం వెంకటేష్, సుధాకర్‌చౌదరి, కన్వీనర్ యాతం పోతలయ్య ఉన్నారు.


బోనాల ఊరేగింపులో ఎమ్మెల్యే పరిటాల సునీత

## మానసిక ఒత్తిళ్లను జయించాలి: ప్రిన్సిపాల్



మాట్లాడుతున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ విజయశ్రీ

అనంతపురం వైద్యం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సమస్యల పట్ల విశాలమైన దృక్పథం పెంపొందించుకుంటే మానసిక ఒత్తిళ్లను జయించవచ్చునని వైద్యవిద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయశ్రీ అన్నారు. శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మానసిక వైద్య విభాగాధిపతి ప్రొఫెసర్ శారద అధ్యక్షతన వేడకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్, వైస్‌ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ శంకర్, ప్రొఫెసర్ మధు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్ శౌరి, జిల్లా లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి రాజశేఖర్ బాబు కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో మానసిక స్థితిని కోల్పోకూడదన్నారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ సుమన గోపీచంద్, డాక్టర్లు రవికుమార్, వరదరాజులు పాల్గొన్నారు.

## అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు లేదా హమాలీలు దసరా పండుగ పేరుతో కానీ, ఇతర కారణాలతో ఎఫ్‌పీ షాపు డీలర్ల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడితే క్రమశిక్షణా చర్యలు తప్పవని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మేనేజర్ రమేష్‌రెడ్డి హెచ్చరించారు. 9వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'మామూళ్లే' కథనానికి ఆయన స్పందించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి అలా చేయకూడదని స్పష్టం చేశారు.

## లక్ష్యం, పట్టుదల ఉంటేనే ఉన్నతస్థాయికి

● అసిస్టెంట్ కలెక్టర్ సచిన్‌రహార్



విద్యార్థికి ప్రశంసాపత్రం, షీల్డ్ అందజేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్

అనంతపురం విద్య, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): లక్ష్యం, పట్టుదలతో చదివితేనే ఉన్నతస్థాయికి వెళ్లగలరని అసిస్టెంట్ కలెక్టర్ సచిన్‌రహార్ సూచించారు. జిల్లాకేంద్రంలోని ట్రెల్లీస్ స్కూల్‌లో వారం రోజులుగా ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను నిర్వహించారు. శుక్రవారం ముగింపు రోజు ఏర్పాటు చేసిన సదస్సుకు అసిస్టెంట్ కలెక్టర్, ఇస్రోశాస్త్రవేత్త దీపక్‌సింగ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రపంచం మరింత అభివృద్ధి వైపు వెళ్లాలంటే చదువే ఆయుధమన్నారు. అందుకే ఎప్పటికపుడు వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. ఏపనిచేసినా ఇష్టంతో కష్టపడి నేర్చుకోవాలన్నారు. అప్పుడే మంచి ఫలితాలు సాధించగలరని విద్యార్థులకు సూచించారు. అనంతరం అంతరిక్ష వారోత్సవాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలుపంపిణీ చేసి అభినందించారు. కార్యక్రమంలో చైర్మన్ శ్రీకాంత్, టీచర్లు పాల్గొన్నారు.

## నేడు వైద్య శిబిరం

రాప్తాడు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 18 సంవత్సరాలలోపు దివ్యాంగ విద్యార్థులకు అవసరమయ్యే ఉచిత సహాయ ఉపకరణాలు, పరికరాల కోసం శనివారం స్థానిక ఉన్నత పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్ష అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సహాయ పరికరాలు అవసరమయ్యే అర్హత కలిగిన పిల్లలను వైద్యం, సాంకేతికత ద్వారా గుర్తిస్తారన్నారు. విద్యార్థులు ఫొటో, ఆధార్, ఫోన్ నెంబర్, సదరం సర్టిఫికెట్, రేషన్‌కార్డులతో హాజరుకావాలన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాప్తాడు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రాప్తాడు సెక్షన్ పరిధిలో 11కేవీ ఆర్‌డీటీ ఫీడర్‌లో మరమ్మతు పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఇన్‌చార్జి ఏఈ గౌస్‌మొద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్డీటీ స్టేడియం, పంగల్‌రోడ్డు, అనంత టౌన్‌షిప్ కాలనీ, మైనార్టీ కాలనీలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

## 'సమస్యలపై నిరంతర పోరాటం'

అనంతపురం విద్య, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలు, పేదల భూసాగుసమస్యల సాధనకు నిరంతరం పోరాటం సాగిస్తామని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కేశవరెడ్డి అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదలకోసం కార్మిక సంఘం అండగా ఉండాలన్నారు. ఇళ్లులేని ప్రతిపేదవాడికి ప్రభుత్వం ఇల్లు మంజూరు చేయాలని, దళిత, గిరిజనవాడల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి వ్యవసాయ కూలీల సంఘాన్ని బలోపేతం చేద్దామన్నారు. పెద్దయ్య, సంగప్ప, దేవేంద్ర, నాగమణి, చిన్నరాయుడు, ప్రసాద్, నారాయణమ్మ పాల్గొన్నారు.

## శాలరీ ప్యాకేజీ, బీమా పాలసీపై అవగాహన


అనంతపురం క్రైం, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): పోలీసులకు బ్యాంకు అధికారులు, పోలీస్ ఉన్నతాధికారులు శాలరీ ప్యాకేజీ వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. శుక్రవారం డీపీఓలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్‌బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఎస్‌బీఐ సాయినగర్ బ్రాంచ్ ఏజీఎం నందగోపాల్, డిప్యూటీ బ్రాంచ్ మేనేజర్ నాగకుమార్ ఆధ్వర్యంలో పోలీసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాలరీ ప్యాకేజీ, వాటి ప్రయోజనాలు, సఫైర్ సూపర్ హెల్త్ టాప్‌అప్ ఇన్సురెన్స్ పాలసీపై చైతన్యం కల్పించారు. ఆర్ఐ పవన్ కుమార్, ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

## యువకుడి ఆచూకీ లభ్యం

రాప్తాడు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలచెర్ల గ్రామానికి చెందిన అట్టే లింగమయ్య, మాలమ్మ దంపతుల చిన్నకుమారుడు అట్టే పోతులయ్య 4వ తేదీన మధ్యాహ్నం తోటలోకి వెళుతున్నాని కుటుంబ సభ్యులకు చెప్పి బయటకు వెళ్లాడు. ఆ తరువాత ఇంటికి రాకపోవడంతో 5వ తేదీన తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా పోతులయ్య ఆచూకీ తెలియలేదు. అతను శుక్రవారం తనంతటతానే రాప్తాడు పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. మిస్సింగ్ కేసు నమోదు చేయడంతో తహసీల్దార్ విజయకుమారి ఎదుట అతనిని హాజరుపరచి అనంతరం తల్లితండ్రులకు అప్పగించారు.

# అవకాశాల్లో బాలికలకు సమానత్వం

● డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి

అనంతపురం వైద్యం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సమాజంలోని అన్ని అవకాశాల్లో బాలికలకు సమానత్వముందని, వారిని ప్రోత్సహించడం కుటుంబ సభ్యులు మరవకూడదని డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజేంద్ర నగరపాలకోత్స పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యవంతమైన బాలిక కుటుంబానికి బలమని, సమాజాభివృద్ధిలో భాగస్వామ్యమని అన్నారు. డెమో నాగరాజు, డిప్యూటీ డెమో త్యాగరాజు, హెచ్ఈఓ గంగాధర్, ఐసీడీఎస్ పీడీ ఉమాశంకరమ్మ, ఎంఈఓ వెంకటస్వామి, ప్రధానోపాధ్యాయులు రేణుక, హెచ్ఈ వెంకటేష్, వేణు, కిరణ్, లీగల్ కన్సల్టెంట్ ఆశారాణి పాల్గొన్నారు.

రామగిరి(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలను మగపిల్లలతో సమానంగా పెంచి మంచి భవిష్యత్తు నిద్దామని తహసీల్దార్ రవికుమార్ అన్నారు. శుక్రవారం కేజీబీవీ పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎంఈఓ సూర్యప్రకాశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లతాకిరణ్, ఎస్‌ఓ సౌమ్యలత పాల్గొన్నారు.

కనగానపల్లి, (ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులు చదివినప్పుడే బాలికలకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి అన్నారు. స్థానిక జడ్పీ పాఠశాలలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఈఓ శ్రీదేవి, సూపర్‌వైజర్ శ్రీనివాసులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

శింగనమల(ఆంధ్రజ్యోతి): బాలికల హక్కులను కాపాడేందుకు అందరూ కృషి చేయాలని సీడీపీఓ చల్లా లలితమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక కేజీబీవీలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా బాలల పరిరక్షణ సమితి ప్రొటెక్షన్ ఆఫీసర్ చంద్రకళ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు కల్పన, కౌసల్య, నేతాజీ పాల్గొన్నారు.


రామగిరి కేజీబీవీలో బాలికాదినోత్సవం జరుపుకుంటున్న విద్యార్థులు


కలెక్టరేట్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, నాయకులు

# నరిగమ్మ గుడి జోలికొస్తే సహించం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం రోడ్డులోని మైసూరు నరిగమ్మ గుడి జోలికొస్తే సహించేదిలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ శివ నారాయణశర్మను కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళ్యాణదుర్గం రోడ్డు పిల్లిగుండ్ల కాలనీలోని బసవతారకనగర్‌లో వెలసిన మైసూరు నరిగమ్మ తల్లి గుడిని తొలగిస్తామని అధికారులు చెప్పడం హిందువుల మనోభావాలను దెబ్బతీయడమేనని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా పురాతన కాలం నుంచి భక్తుల కొంగు బంగారంగా వెలుగొందుతున్న అమ్మవారి ఆలయాన్ని కొన్ని కారణాలతో తొలగించాలనే దురుద్దేశ్యంతో ప్రయత్నం చేయడం దారుణమన్నారు. నగరంలోని సాయినగర్‌లో అత్యధిక జనసంచారం ఉండే ప్రధాన రోడ్డులో చర్చి, సప్తగిరిసర్కిల్‌లో మసీదు రోడ్డుకు అడ్డంగా ఉన్నా అధికారులకు కనపడడం లేదా అని ఆయన ప్రశ్నించారు. ఆర్డీఓ, తహసీల్దార్లు వచ్చి నరిగమ్మ గుడి తొలగిస్తామని చెప్పి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న సాయినగర్‌లో చర్చి, సప్తగిరిసర్కిల్‌లో ఉన్న మసీదులను తొలగించిన తరువాతే అధికారులు రావాలని సూచించారు. అధికారులు తమ వైఖరి మార్చుకోకుంటే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, పూజారి గోపాల్, శివప్రసాద్, ఆనంద్, శారదమ్మ, లక్ష్మీదేవి, భాగ్య, ప్రవీణ్, సాలమ్మ, మల్లేశ్వరి, పద్మ పాల్గొన్నారు.

## సూపర్ జీఎస్టీతో ప్రతి కుటుంబంలో వెలుగు

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ


వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

నార్పల, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ద్వారా ప్రజలకు భారం తగ్గి, ప్రతి కుటుంబంలో వెలుగులు నింపే నిర్ణయాలు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తీసుకుందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. మండల కేంద్రంలో జీఎస్టీ తగ్గింపుతో ధరల తగ్గుదలపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని వాణిజ్య సముదాయాల దగ్గరకు వెళ్లి కొనుగోలు చేస్తున్న ప్రజలకు జీఎస్టీ తగ్గింపు ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. టీడీపీ నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, ఆకుల ఆంజనేయులు, ఆకుల విజయ్‌కుమార్, బాబు, ప్రతాప్‌చౌదరి, తిప్పన్న, జాఫర్‌వలి, రాజన్న, నాయకుడు, బండ్లపల్లి కుళ్లాయప్ప, పీఎల్ లక్ష్మీనారాయణ, చంద్రబాబు పాల్గొన్నారు.

కనగానపల్లి(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ ప్రయోజనాలు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్ చౌదరి అన్నారు. జీఎస్టీ ప్రయోజనాలపై శుక్రవారం ఆయన వేపకుంట గ్రామంలో ఇంటింటా తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు.

## ఎస్కేయూలో పలువురు ఉద్యోగుల బదిలీ

అనంతపురంరూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పలువురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం వర్సిటీ రిజిస్ట్రార్ రమేష్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, ఏడుగురు జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంటు, మరో ఐదుగురు ఉద్యోగులను బదిలీ చేశారు. మొత్తం 15మందిని ఒక విభాగం నుంచి మరో విభాగానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

### మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను

# ఉపసంహరించుకోవాలి

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి


మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్లను పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2019కు ముందు 11 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు మాత్రమే ఉన్నాయన్నారు. జగన్ సీఎం అయ్యాక రూ.8300కోట్లతో 17 మెడికల్ కళాశాలల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పీపీపీ పేరుతో తన బంధువులు, వర్గాలకు ఆదాయం సమకూర్చడం కోసం వాటిని సీఎం ధారాదత్తం చేస్తున్నారన్నారు. నవంబరు 22 వరకు సంతకాల సేకరణ కొనసాగుతుందని, అనంతరం నియోజకవర్గ కేంద్రాలు, జిల్లా కేంద్రంలో ర్యాలీ చేపడతామన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ బోయగిరిజమ్మ, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# బస్టాండ్ కూల్చి ఏడాదైనా పట్టించుకోరా..!

**వైసీపీ వర్గీయులపై నేటికీ చర్యలు తీసుకోని ఆర్టీసీ అధికారులు**



వైసీపీ వర్గీయులు ధ్వంసం చేసిన యాడికి బస్టాండ్

యాడికి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను వైసీపీ వర్గీయులు ఎలాంటి అనుమతులూ లేకుండా కూల్చేశారు. ఇది గడిచి ఏడాదైనా ఆర్టీసీ అధికారులు వారిపై చర్యలు తీసుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచింది. 1990లో ఆర్టీసీ అధికారులు ఐదెకరాల స్థలాన్ని కొనుగోలు చేసి బస్టాండ్‌ను నిర్మించారు. కొన్నేళ్ల తర్వాత ఆ బస్టాండ్ మూతపడింది. నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌ను ఆర్టీసీ అధికారులు లీజు ప్రతిపాదికన శివారెడ్డి అనే వ్యక్తికి ఇచ్చారు. ఆ స్థలం వ్యవహారాలను స్థానిక వైసీపీ నాయకులు చూసుకునేవారు. గతేడాది అక్టోబరు 6న ఎక్స్‌కావేటర్‌తో బస్టాండ్ భవనాన్ని ఎలాంటి అనుమతులూ లేకుండా కూల్చివేసే పనులు చేపట్టారు. దీనిపై వెంటనే స్థానిక టీడీపీ నాయకులు ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు పోలీసుల ద్వారా ఆ పనులను అడ్డుకున్నారు. అప్పటికే చాలా భాగం కూల్చివేశారు. నాటి తాడిపత్రి ఆర్టీసీ డిపో మేనేజర్ శంకర్ ఆ భవనాన్ని పరిశీలించారు. ఇది చట్టవిరుద్ధమని, తాము స్థలాన్ని మాత్రమే లీజ్‌కు ఇచ్చామని, బస్టాండ్ కూల్చివేతకు ఎటువంటి అనుమతులూ లేవని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇది జరిగి ఏడాదైనా ఆ వైసీపీ వర్గీయులపై ఆర్టీసీ అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. కనీసం వారి నుంచి నష్టాన్ని కూడా రికవరీ చేయలేదు. ప్రభుత్వ భవనాలను కూల్చివేసినా అధికారులు పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. దీనిపై డిపో మేనేజర్‌ను ఫోన్ ద్వారా సంప్రదించడానికి ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

**రికవరీకి ఆర్డర్ పెట్టారు**

బస్టాండ్ కూల్చివేత పనులు చేపట్టిన లీజు హక్కుదారుడికి లీజు రద్దు చేశారు. కూల్చివేత పనుల వలన జరిగిన నష్టాన్ని రికవరీ చేయడానికి ఆర్డర్ పెట్టారు. ఇదంతా ఈడీ కార్యాలయం నుంచి జరుగుతుంది. పూర్తి వివరాలు డిపో మేనేజర్ వద్ద ఉంటాయి.

-నందిని, ఏడీఎం, ఆర్టీసీ తాడిపత్రి డిపో

## న్యూస్ బాక్స్

### ఘనంగా టెక్ స్పార్క్ సింపోజియం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కళాశాల సెక్రటరీ

తాడిపత్రి, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని తాడిపత్రి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం కంప్యూటర్ సైన్స్ విభాగం టెక్ స్పార్క్ - 2కె25 జాతీయ సింపోజియం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో కళాశాల సెక్రటరీ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ... ఈ కార్యక్రమం వల్ల విద్యార్థుల్లో నైపుణ్యశక్తి పెరుగుతుందన్నారు. కేవలం కంప్యూటర్ రంగంలో మాత్రమే కాకుండా అన్ని రంగాల్లో రాణించేందుకు విద్యార్థులు సన్నద్ధం కావాలన్నారు. ఈ సింపోజియమ్‌లో పేపర్ ప్రజంటేషన్ ఇచ్చిన పలు కళాశాలల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అశోక్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ నటరాజేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ భానుప్రసాద్ పాల్గొన్నారు.

### సింగిల్‌విండో అధ్యక్షుడిగా గోవర్ధన్‌రాజు



పుట్లూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పుట్లూరు సింగిల్‌విండో అధ్యక్షుడిగా కడవకల్లుకు చెందిన ఏటూరి గోవర్ధన్‌రాజును ప్రభుత్వం శుక్రవారం నియమించింది. తనను సింగిల్‌విండో ప్రెసిడెంట్‌గా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి రుణపడి ఉంటానని గోవర్దన్‌రాజు అన్నారు.

### క్రీడాదుస్తుల అందజేత



క్రీడాదుస్తులతో విద్యార్థులు

రాయదుర్గం రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా ఖోఖో జట్టుకు రూ.15 వేలు విలువ చేసే క్రీడా దుస్తులను మైక్రోబయాలజీ అధ్యాపకులు కిరణ్ జక్కల శుక్రవారం అందజేశారు. ఈ నెల 29న అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో జరిగే ఇంటర్ కాలేజీయేట్ గ్రూపు పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.

### అనధికార కార్లపై చర్యలు తీసుకోండి

ఉరవకొండ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులూ లేకుండా ఉరవకొండ,అనంతపురానికి ప్రయాణికులను తరలిస్తున్న ఎర్టిగా సీఎన్‌జీ కార్ల యజమానులపై చర్యలు తీసుకోవాలని శ్రీసాయి లైట్ మోటార్ వెహికల్ ఫోర్ వీలర్స్ వెహికల్ యూనియన్ నాయకులు శుక్రవారం డిమాండ్ చేశారు. వారిని అడ్డుకోవడంలో ఆర్టీసీ, రవాణాశాఖ అధికారులు పూర్తిగా విఫలయ్యారన్నారు. ఎండీకి ఫిర్యాదు చేసినా పట్టించు కోలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలన్నారు.

### వ్యక్తి ఆత్మహత్య

పెద్దవడుగూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ప్రతాప్‌రెడ్డి (49) గ్రామ సమీపంలోని ఓ చెట్టు కింద శుక్రవారం విషపు గుళికలు మింగడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. రాత్రి అటుగా వెళ్తున్న గ్రామస్థులు గుర్తించి.. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి పరిశీ లించగా అతను అప్పటికే మరణించినట్లు గుర్తించారు. ప్రతాప్‌రెడ్డికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

### సూపర్ జీఎస్టీపై విద్యార్థుల బైక్ ర్యాలీ

గుంతకల్లుటౌన్, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో విద్యార్థులు సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పిస్తూ శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇందులో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ రవిశంకర్ వర్మ, అధ్యాపకులు యూ రాఘవేంద్రప్రసాద్, ఆర్ నాగరాజు, బాలకృష్ణ, ఎన్ నారాయణ, ఎస్‌ఏ అల్తాఫ్, రాజశేఖర్, శివప్రసాద్, మర్రిస్వామి పాల్గొన్నారు.

### చదువుతోనే సమసమాజ నిర్మాణం

కుందుర్పి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సమాజంలో అంతరాలు తొలగి.. సమ సమాజ నిర్మాణం ఏర్పాటు ఒక్క చదువుతోనే సాధ్యమని వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వందేమాతరం రవీంద్రరావు పేర్కొన్నారు. సమాజ క్రాంతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీలో నిర్వహించిన విద్యార్థి ఆలోచించు ప్రేరణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సమాజ క్రాంతి ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు ఎస్కే లెనిన్ బాబు మాట్లాడుతూ... కళాశాల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, కమ్యూనికేషన్స్ స్కిల్స్ అందించడానికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ వసికేరప్ప, కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### అంతర్జాతీయ బాలికా దినోత్సవం

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: గుంతకల్లు, తాడిపత్రి, బెళుగుప్ప, గుత్తి, కణేకల్లు తదితర ప్రాంతాల్లో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. అక్టోబరు 11 శనివారం సెలవు కావడంతో ముందుగా శుక్రవారమే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గుంతకల్లు కేజీబీవీ పాఠశాలలో, తాడిపత్రి ఏపీ మోడల్ స్కూల్‌లో, గుత్తి కస్తూరిబా పాఠశాలలో, కణేకల్లు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో, బెళుగుప్ప మండలం దుద్దేకుంట ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమాలను చేపట్టారు.

### రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 2,710 క్యూసెక్కులు

బెళుగుప్ప, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 2,710 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 2, 670 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు శుక్రవారం వెల్లడించారు. ప్రస్తుతం రిజర్వాయర్ 1.729 టీఎంసీల నీటి నిల్వ ఉందని, ఇక్కడి నుంచి ఫేజ్-2కు 1,908 క్యూసెక్కుల నీరు వెళ్తోందని తెలిపారు.

### చిన్నపాటి వానొచ్చినా..!

బెళుగుప్ప, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): గుండ్లపల్లి క్రాస్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద రోడ్డుపై భారీ గుంత ఏర్పడింది. దీంతో చిన్న వాన వచ్చినా.. అందులో నీరు నిల్వ ఉంటోంది. దీంతో ఆ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లడానికి కూడా స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



సిమెంటు రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

## అంగన్‌వాడీల జీతాల పెంపునకు కృషి : విప్



సమావేశంలో మాట్లాడుతున్న విప్ కాలవ

రాయదుర్గంరూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో అంగన్‌వాడీలు కీలకపాత్ర పోషిస్తున్నారని, వారి జీతభత్యాల పెంపు విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తప్పక తీసుకెళ్తానని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో స్థానిక డ్వామా కార్యాలయంలో నిర్వహించిన 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తల్లి మంచి పౌష్టికాహారం తీసుకుంటే సంతానం కూడా బలంగా, ఆరోగ్యవంతంగా జన్మిస్తారన్నారు. ఇందులో సీడీపీఓ పద్మావతి, పీహెచ్‌సీ వైద్యులు రాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ కొండన్న, సూపర్‌వైజర్లు రామాంజనేయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నాగరత్నమ్మ, ఉమాదేవి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

● దివ్యాంగ విద్యార్థులకు శిబిరం: దివ్యాంగ విద్యార్థులకు ఉచిత పరికరాల ఎంపిక శిబిరాన్ని పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఇందులో విప్ కాలవ, ఏపీసీ జిల్లా అధికారి శైలజ, ఐదు మండలాల ఎంఈఓలు మహమ్మద్‌ఇర్షాద్, వెంకటరమేష్, మల్లికార్జున, సనవర్‌బాషా, భవాని, శంకర్, రామచంద్ర పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న మహిళలు

## రోడ్డుపై నిత్యం మురుగు

విడపనకల్లు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లే దారి నుంచి బీసీ (ఉప్పర) కాలనీలోకి వెళ్లే మార్గంలో నిత్యం మురుగు, వర్షపు నీరు నిల్వ ఉంటోందని, సమస్యను పరిష్కరించాలని ఆ కాలనీ మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆందోళన చేపట్టారు. పోలీస్ స్టేషన్‌కు సీసీ రోడ్డును ఎత్తులో వేయడంతో బీసీ కాలనీ రోడ్డు పూర్తిగా తగ్గుగా మారి మురుగు బయటకు వెళ్లలేక అక్కడే నిల్వ ఉంటోందన్నారు. దీంతో ఆ రోడ్డు పాచిపట్టి.. జారి పడుతున్నామని , తీవ్ర దుర్వాసన వస్తోందని వాపోయారు. పోలీస్ స్టేషన్ దారిలోని డ్రైనేజీలు పూడికతో నిండిపోయి రోడ్డుపై వచ్చే నీరు కూడా తమ కాలనీలోకే వస్తోందన్నారు. సీసీ రోడ్డు, డ్రైనేజి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మహేష్ మహిళలుతో మాట్లాడుతూ మురికి నీరు నిలువ లేకుండా చర్యలు చేపడుతామన్నారు.

## సమ్మెలో వైద్యులు.. ఇబ్బందుల్లో రోగులు



బొమ్మనహాళ్ ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్న స్టాఫ్‌నర్సులు, యాడికిలో తలుపులు తెరవని వైద్యుల గది

బొమ్మనహాళ్/యాడికి అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బొమ్మనహాళ్ మండలంలోని బొమ్మనహాళ్, శ్రీధరఘట్ట, దర్గాహొన్నూరు పీహెచ్‌సీల్లోని వైద్యులు గత నెల 30 నుంచి సమ్మెలో వెళ్లారు. దీంతో జ్వరం, దగ్గు, వాంతులు, చలి తదితర వాటితో ఆయా ఆస్పత్రులకు వచ్చే రోగులు వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రుల్లోని స్టాఫ్ నర్సులు, హెల్త్ అసిస్టెంట్లు తాత్కాలికంగా వైద్యం అందిస్తున్నారు. పరిస్థితి తీవ్రంగా ఉన్న రోగులు పక్కరాష్ట్రంలోని బళ్లారి, రూపనగుడి ప్రాంతాలకు వెళ్తున్నారు.

● యాడికి : ప్రభుత్వ వైద్యులు సమ్మెలో ఉండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ 200మంది రోగులు యాడికిలోని పీహెచ్‌సీకి వచ్చేవారు. వైద్యులు ఎవరూ ఆస్పత్రికి రాకపోవడంతో వారు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తూ.. జేబులు ఖాళీ చేసుకుంటున్నారు.

## 'స్వచ్ఛందంగా టీడీపీలో చేరాం'



మాట్లాడుతున్న ముద్దలాపురం గ్రామస్థులు

కూడేరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): 'మేం 20 ఏళ్ల నుంచి కాంగ్రెస్, వైసీపీలో ఉన్నా న్యాయం జరగలేదు. పయ్యావుల సోదరులు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తుంటే మేమే స్వచ్ఛందంగా టీడీపీలో చేరాం. మాపై ఎవరి ఒత్తిళ్లు లేవు. సీఐ రాజు ఒత్తిళ్ల మేరకే మేం టీడీపీలో చేరామంటూ మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత విశ్వేశ్వరరెడ్డి ఆరోపించడం తగదు ' అని మండలంలోని ముద్దలాపురం గ్రామస్థులు పూజారి రమేష్, లక్ష్మినారాయణ, ధనుంజయ్య స్పష్టంచేశారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. విశ్వేశ్వరరెడ్డి అనవసరంగా రాద్ధాంతం చేయడం మంచి పద్ధతి కాదని, సీఐ పేదల పక్షాన పనిచేస్తుంటే ఓర్వలేక నిందలు వేయడం మానుకోవాలని హితువు పలికారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పెద్దవడుగూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈనెల 5, 8 తేదీల్లో జరిగిన వెయిట్‌లిఫ్టింగ్, జిమ్నాస్టిక్స్ పోటీల్లో మండలంలోని లక్షుంపల్లి పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వెయిట్‌లిఫ్ట్ పోటీల్లో అండర్- 17 విభాగంలో పదో తరగతి విద్యార్థిని రాజీకళ, అండర్- 14 విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థిని గాయత్రీ, జిమ్నాస్టిక్ పోటీల్లో అండర్ -14 విభాగంలో ఎనిమిదో తరగతి విద్యార్థి దయానంద్, ఏడో తరగతి విద్యార్థి కల్పన, అండర్ - 19 విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థిని అప్పన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం శేషాచలం, పీడీ కృపాకిరణ్ శుక్రవారం తెలిపారు. ఈ విద్యార్థులకు రూ.20 వేలు విలువగల క్రీడాదుస్తులను మాజీ ఎంపీపీ ఓబులరెడ్డి అందజేశారు.

### ఆధార్ సేవలు బంద్

బెళుగుప్ప, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ ఆధార్ కేంద్రంలోని సేవలు బంద్ అయ్యాయి. శుక్రవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులు రావడంతో ఆ కేంద్రంలోని మిషనరీ పూర్తిగా కాలిపోయినట్లు నిర్వాహకులు గోవిందరాజులు తెలిపారు. తహసీల్దార్ అనిల్ కుమార్‌కు ఈ విషయాన్ని తెలియజేశామని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

## పిన్నేపల్లిలో తాగునీటి కష్టాలు

యాడికి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిన్నేపల్లిలో తాగు నీటి కోసం గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని బోరుబావిలో నీళ్లు అడుగంటిపోవడంతో మూడు నెలల నుంచి ఈ సమస్య నెలకొంది. సమస్యను గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా .. వారు తాత్కాలికంగా ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారే త ప్పా.. సమస్యను శాశ్వతంగా పరిష్కరించడం లేదు. కూలి పనులకు వెళ్లకుండా ట్యాంకర్ కోసం రోజూ ఎదురు చూడాల్సి వస్తోందని, నీరు కూడా చాలడం లేదని ఆ గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పుడే నీటి సమస్య ఇలా ఉంటే ఇక వేసవికాలంలో తమ పరిస్థితి ఏమిటోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకర్ వచ్చినప్పుడు నీటికోసం గొడవ పడాల్సి వస్తోందన్నారు. అధికారులు, పాలకులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



పిన్నేపల్లిలో తాగునీటి ట్యాంకర్ వద్ద రద్దీ

## రూ.1.88 లక్షలకు తలనీలాల వేలం

గుత్తి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడులో బొలికొండ రంగనాథస్వామి ఆలయంలో తలనీలాల వేలం పాటను దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అక్కిరెడ్డి, ఆలయ ఈఓ శోభ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన గంగమ్మ రూ. 1.88 లక్షలకు వేలం పాడి దక్కించుకున్నారు. గత ఏడాది రూ. 1.82 లక్షలకు ఈ వేలం పోగా ఈ సారి ఆలయానికి అదనంగా రూ.6 వేలు వచ్చింది. ఇందులో టీడీపీ నాయకులు రంగస్వామి రెడ్డి, మద్దిలేటి, ఓబన్న పాల్గొన్నారు.

### నీటి సమస్య పరిష్కారం

ఉరవకొండ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిగొండ బీసీ కాలనీలో తాగునీటి బోరు చెడిపోవడంతో నాలుగు నెలలుగా ఆ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. శుక్రవారం బోరుతో పాటు మోటారును రిపేరీ చేయించామని, దీంతో సమస్య పరిష్కారమైందని టీడీపీ నాయకులు లక్ష్మన్న, గురు, చెన్నప్ప తెలిపారు.

### పారిశుధ్య పనుల పరిశీలన

శెట్టూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొచ్చుపల్లిలో పారిశుధ్య పనులను, వ్యర్థపదార్థాలతో ఎరువుల తయారీ షెడ్డును జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్ శుక్రవారం పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ జిలాని బాషా డిప్యూటీ ఎంపీడీఓ రఘురామారావు, పంచాయతీ కార్యదర్శి ఓబుళపతి ఉన్నారు.

## అర్హత లేకున్నా మండలమీట్‌కు వైసీపీ నాయకులు

**చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకుల డిమాండ్**

కణేకల్లు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం జరిగిన సర్వసభ్య సమావేశానికి పూలచెర్ల సర్పంచ్ పద్మావతి స్థానంలో వైసీపీ నాయకులైన ఆమె భర్త రవి, మామ నాగరాజు హాజరయ్యారు. దీనిపై పూలచెర్ల గ్రామ టీడీపీ నాయకులు నగేష్‌రెడ్డి, నరేష్, మంజునాథ్‌రెడ్డి, పుల్లంపల్లి ప్రభాకర్, లక్ష్మీరెడ్డి శుక్రవారం మీడియాతో మాట్లాడారు. రవి రౌడీషీటర్‌గా ఉన్నాడని, అటువంటి వ్యక్తిని మండల మీట్‌లోకి అధికారులు ఎలా అనుమతించారని ప్రశ్నించారు. రాజ్యాంగం కల్పించిన మహిళా రిజర్వేషన్‌ను తుంగలో తొక్కే విధంగా వీరు గ్రామంలో జరిగే ప్రతి సమావేశాలకు హాజరవుతూ అందరినీ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. తాజాగా ఏకంగా మండల అధికారులంతా ఉండే సమావేశానికి హాజరైనా అధికారులు స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇటువంటి వారిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సమావేశానికి హాజరైన వైసీపీ నాయకులు

## క్రైం న్యూస్..

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పుట్లూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన పెద్దిరాజు (40) అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడు. ఇతను ఒక జేసీబీ, రెండు ట్రాక్టర్లు లీజుకు తీసుకొని నడిపేవాడు. వాటిలో నష్టం రావడంతో అప్పులపాలయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన పెద్దిరాజు మూడు రోజుల క్రితం ఇంట్లోనే విషద్రావకం తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు అతన్ని వెంటనే అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. కోలుకోలేక ఆయన శుక్రవారం మరణించాడు. భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పుట్లూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్. వెంగన్నపల్లి గ్రామశివారులో ద్విచక్రవాహనాన్ని కారు ఢీ కొనడంతో గోపరాజుపల్లి గ్రామానికి చెందిన జయరంగారెడ్డి, వసంత గాయపడ్డారు. శుక్రవారం వీరు ఉపాధి పనులకు బైక్‌పై వెళుతుండగా ఎదురుగా కారు వచ్చిక ఢీకొంది. దీంతో ఈ ఇద్దరి కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. వెంటనే వారిని 108లో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

### మట్కాబీటర్ల అరెస్ట్.. రూ.4 లక్షల స్వాధీనం



మట్కాబీటర్లను చూపుతున్న సీఐ

తాడిపత్రి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నందలపాడు సమీపంలో మట్కా నిర్వహిస్తున్న ఆరుగురిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ ఆరోహణరావు తెలిపారు. వారి నుంచి రూ.4 లక్షలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

● చుక్కలూరు క్రాస్ వద్ద మరొకరు..: తాడిపత్రి మండలంలోని చుక్కలూరు క్రాస్ వద్ద ఓ మట్కా రాస్తున్న సత్యసాయి జిల్లా కదిరి పట్టణానికి చెందిన ఓ వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. అతని నుంచి రూ.6,810 స్వాధీనం చేసుకున్నామన్నారు.

### మహిళ అదృశ్యం

యాడికి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవరాయునిపేట గ్రామానికి చెందిన చిన్ననాగమ్మ కనిపించడం లేదని ఆమె భర్త చిన్న సుబ్బన్న పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఈ నెల ఎనిమిదో తేదీన ఇంటి నుంచి వెళ్లిన చిన్ననాగమ్మ తిరిగి ఇంటికి రాలేదని, పలుచోట్ల గాలించినా ఫలితం లేకుండా పోయిందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### రామసాగరంలో పట్టపగలే చోరీ

బెళుగుప్ప, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామసాగరంలో పట్టపగలే తాళమేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. బోయ పద్మావతి బుధవారం తన ఇంటికి తాళవేసి.. పనులకు వెళ్లింది. సాయంత్రం తిరిగి వచ్చి చూడగా.. దుండగులు ఇంటి తాళం పగులగొట్టి.. బీరువాలోని రెండున్నర తులాల బంగారు నగలను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. దీనిపై గురువారం రాత్రి ఆమె ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు.

### 24 మందిపై కేసు

గుత్తి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పాతసీపీఐ కాలనీలో దస్తగిరి స్వామిజెండా కట్ట స్థల విషయంలో గురువారం ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. భాగ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాదాఖలంధర్, వరిగడ్డి షేక్షావలితో పాటు మరో 22 మందిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ సురేష్ శుక్రవారం తెలిపారు.

### బ్యాటరీల చోరీ

ఉరవకొండ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని కొనకొండ్ల శివారులో జియో టవర్‌లో నాలుగు బ్యాటరీలు, కరెంట్ తీగలు గత చోరీ అయ్యాయి. టవర్ సూపర్‌వైజర్ ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు.

### విచారణ వాయిదా

తాడిపత్రి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊరుచింతలలో 2023 నుంచి 2025 మే వరకు జరిగిన పంచాయతీ సర్పంచు నిధుల్లో అవకతవకలు జరిగాయని ఆ గ్రామానికి చెందిన రజనీకాంత్‌రెడ్డి కలెక్టర్‌కు ఇటీవల స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సర్పంచు వసుంధరాదేవిని ఎంపీడీఓ ఫజుల్‌బాషా, సీనియర్ అసిస్టెంట్ రవికుమార్ శుక్రవారం విచారించారు. అయితే నాడు పనిచేసిన అధికారులు రాకపోవడంతో విచారణను ఈనెల 17కు వాయిదా వేసినట్లు వారు తెలిపారు.